RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:18 ISSUE:2 MONDAY ,MAY 4,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :2 సోమవారం, మే 4, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



## కవిత పార్టీ పై కేఏ పాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

- కవితతో పార్టీ ఎవరు పెట్టించారో అందరికీ తెలుసన్న కేఏ పాల్
- అందుకే ఆ పార్టీలో మాజీలు చేరడం లేదని వ్యాఖ్య
- కవిత సీఎం పదవి అడిగితే తండ్రి నిరాకరించారన్న పాల్
- యుద్ధం ఆపేందుకు ట్రంప్‌తో చర్చలు జరిపే పనిలో ఉన్నానన్న కేఏ పాల్

2లో

# తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ప్రక్రియకు మరింత సమయం



- మంత్రివర్గ విస్తరణతో పాటు శాఖల ప్రక్షాళన కొన్ని కీలక శాఖల్లో మార్పులు
- కొందరు మంత్రుల వ్యవహార శైలి పై ప్రజల్లో అసంతృప్తి
- కొందరిని తొలగించే అవకాశం కొత్తవారికి సైతం కేబినెట్లో అవకాశం
- ఖాళీల్లో ఇద్దరు నేతల్ని రాష్ట్ర మంత్రి వర్గంలోకి తీసుకునేం దుకు వీలు?
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి తెలంగాణ క్యాబినెట్లో ప్రాతినిధ్యం?
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తారా?

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. మంత్రివర్గం నుంచి కొందరిని తొలగించే అవకాశం ఉండగా కొత్త వారికి సైతం కేబినెట్లో అవకాశం లభించనుంది. 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, ముఖ్యంగా కేరళలో - మిగతా2లో

## ఇరాన్ డీల్ పై ట్రంప్ సమీక్ష...

### అయినా దాడులు తప్పవంటూ హెచ్చరిక



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించిన కాన్సెప్ట్ పై తనకు వివరించారని, అయితే తుది ప్రతిని పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అదే సమయంలో టెహ్రాన్ దుందుడుకుగా ప్రవర్తిస్తే సైనిక చర్యకు వెనుకాడబోమని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఫ్లోరిడా నుంచి మియామి వెళ్లే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఒప్పందానికి సంబంధించిన కాన్సెప్ట్‌ను వారు నాకు వివరించారు. ఇప్పుడు పూర్తి వివరాలతో కూడిన ప్రతిని ఇవ్వనున్నారు" అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు - మిగతా2లో

## మధ్యప్రదేశ్ ప్రమాదంతో అప్రమత్తం తెలంగాణలో బోటింగ్ పై కఠిన నిబంధనలు



తెలంగాణ పత్రిక ప్రతినిధి

మధ్యప్రదేశ్‌లోని బార్గి రిజర్వాయర్‌లో ఇటీవల జరిగిన ఘోర పడవ ప్రమాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలోని అన్ని బోటింగ్ కేంద్రాల్లో కఠినమైన భద్రతా చర్యలను అమలు చేయాలని తెలంగాణ - మిగతా2లో

## నన్ను డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది సీవీ ఆనంద్ భావోద్వేగం



- తల్లిని కలిసి ఆశీస్సులు తీసుకున్న తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్
- గతంలో తన తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని వెల్లడి
- కొడుకును డీజీపీగా చూడాలన్న కోరికే ఆమెను కాపాడిందని భావోద్వేగం
- ప్రస్తుతం ఆమె కోలుకున్నారని, ఇద్దరం సంతోషంగా ఉన్నామని వెల్లడి 2లో

## సీఎం, మంత్రులు రోడ్ల పై తిరగలేరు రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘాటైన బహిరంగ లేఖ
- జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- 10 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా పథకానికి ఎసరు పెడుతున్నారని విమర్శ
- విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిక




తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘాటైన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం - మిగతా2లో

# ధాన్యం కొనుగోలు చేయడంలో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్

తెలంగాణ పత్రిక ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫెయిల్ అయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఆదివారం జిల్లాలోని మల్లారం వద్ద సిద్దిపేట-కరీంనగర్ రాజీవ్ జాతీయ రహదారి పై ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలనీ డిమాండ్ చేస్తూ రైతులకు మద్దతుగా హరీశ్ రావు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు ధర్నాలు చేస్తున్నారని - మిగతా2లో



# కరీంనగర్‌లో దొంగల బీభత్సం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కరీంనగర్‌లోని పీఎంజే జువెలర్స్‌లో జరిగిన కాల్పుల ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన జరిగిన కొన్ని నిమిషాల ముందే - మిగతా2లో



## కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎంపీ ధర్మపురి అర్వింద్



తెలంగాణ పత్రిక ప్రతినిధి

నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ నెల 10న - మిగతా2లో

# తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ప్రక్రియకు మరింత సమయం

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం ఉన్న ఖాళీల్లో మరో ఇద్దరు నేతల్ని రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకునేందుకు వీలుంది. ఇందులో ఒక స్థానాన్ని ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించే ఛాన్స్ ఉండటంతో రేసులో బాలూనాయక్, రామచంద్రునాయక్ వంటి నాయకులు ఉన్నారు. మంత్రి పదవి తమనే వరిస్తుందని దీమాగా ఉన్నారు. అయితే రామచంద్రునాయక్ను గత ఏడాది డిప్యూటీ స్పీకర్ పోస్టుకు ఖరారు చేసినప్పటికీ శాసనసభలో ఇంకా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయలేదు. ఇక మరో మంత్రి పదవి బెర్త్ కోసం పలువురు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలకే అధిష్ఠానం ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో సీనియర్ నేతలు, పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించే వారి పేర్లను సైతం కాంగ్రెస్ అధిష్టానం పరిశీలించనుంది.

**కొందరు మంత్రుల వ్యవహార శైలిపై ప్రజల్లో అసంతృప్తి?**

కొందరు మంత్రుల వ్యవహారశైలిపై ప్రజల్లో అసంతృప్తి ఉన్నందున పార్టీకి సైతం డ్యామేజ్ జరగకూడదని వారిని మార్చాలని రేవంత్ సూచించే అవకాశాలున్నాయి

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి తెలంగాణ క్యాబినెట్లో ప్రాతినిథ్యం?**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి తెలంగాణ క్యాబినెట్లో ప్రాతినిథ్యం లేదు. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, సీతక్క మంత్రులుగా ఉన్నారు. నిజామాబాద్ నుంచి సీనియర్ ఎమ్మెల్యే పి.సుదర్శన్రెడ్డి ప్రస్తుతం క్యాబినెట్ హోదాలో ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారు. ఆయనను మంత్రిగా తీసుకుంటారా లేక ఇదే జిల్లాకు చెందిన పీసీసీ చీఫ్, రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు అయిన మహేశ్కుమార్ గౌడ్కు మంత్రి పదవి దక్కుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే రేవంత్ మాత్రం మహేష్ గౌడ్ను పార్టీ పరంగానే ప్రయోజనం కోసం పీసీసీ అధ్యక్షుడిగానే కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి విజయం సాధించాలంటే మహేష్ గౌడ్ లాంటి నేత పార్టీ సారథిగా ఉండాలని రేవంత్ భావిస్తున్నారు.

**మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తారా?**

మంత్రి పదవి కోసం చాలా మంది రేసులో ఉన్నప్పటికీ ప్రత్యేకంగా వినిపించే పేరు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మునుగోడు ఎమ్మెల్యే తనకు ఖచ్చితంగా అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. అయితే ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటం మైనస్ అవుతోంది. కుటుంబం నుంచి ఒకే మంత్రి పదవి ఇవ్వాలని, రెండు పదవులు ఇవ్వకూడదని కాంగ్రెస్ హైకమాండ్ అభ్యంతరం తెలుపుతోంది. రేవంత్ రెడ్డి అధిష్టానంతో మాట్లాడి ఒప్పించడం అంత ఈజీ కాదని వినిపిస్తోంది. వీరితో పాటు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు, మలరెడ్డి రంగారెడ్డి, మదన్మోహన్ రావు, రామ్మోహన్ రెడ్డి కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. ప్రేమ్ సాగర్ రావుకు క్యాబినెట్ హోదాలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. కానీ ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు.

**మంత్రివర్గ విస్తరణతో పాటు శాఖల ప్రక్షాళన. కొన్ని కీలక శాఖల్లో మార్పులు**

మంత్రివర్గ విస్తరణతో పాటు కొన్ని కీలక శాఖల్లో మార్పులు జరగనున్నాయని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డికి అదనపు బారంగా మారిన కీలకమైన హోం శాఖ బాధ్యతను ఒక సీనియర్ మంత్రికి అప్పగిస్తారని పార్టీలోనూ వినిపిస్తోంది. ఇప్పటికే విద్యాశాఖమంత్రిగా రేవంత్ ఉన్నప్పటికీ టెన్త్, ఇంటర్ ఫలితాలు ప్రభుత్వ సలహాదారు కేశవరావు విడుదల చేశారని తెలిసిందే! కేరళ ఎన్నికల ఫలితాల తర్వాతే తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళనపై కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. కనుక కేబినెట్ విస్తరణకు మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

# సీఎం, మంత్రులు రోడ్ల పై తిరగలేరు రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 7ను వెంటనే ఉపసంహరించు కోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని అన్నారు. సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరని ఆయన హెచ్చరించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని కేటీఆర్ తన లేఖలో తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 7 ముమ్మాటికీ ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ. దీనివల్ల 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుంది. ఇది నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే వెన్నుపోటు చర్య" అని కేటీఆర్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కొనసాగించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకానికి గ్రహణం పట్టిందని విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా సుమారు 10 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను చెల్లించలేదని, ఇప్పుడు విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తామంటే ఎవరూ నమ్మరని కేటీఆర్ అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో 2500కు పైగా కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. నిధులు అడిగిన వారిని వన్-టైమ్ సెటిల్మెంట్, టోకెన్ల పేరుతో మభ్యపెట్టారని, నిరసన తెలిపితే విజిలెన్స్ దాడులతో బెదిరించారని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే గురుకులాల్లో 142 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ వేలాది మంది సరైన భోజనం లేక ఆసుపత్రుల పాలవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు 3.75 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలకు మాత్రం ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం దుర్మార్గం. రైతుబంధును మూడుసార్లు ఎగ్గొట్టి రైతులను దగా చేశారు. ఇప్పుడు ఫీజుల పథకానికి మంగళం పాడేందుకు దొడ్డిదారులు వెతుకుతున్నారు" అని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలుంటాయని కేటీఆర్ హెచ్చరించారు. "ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ చీకటి జీవోను వెంటనే రద్దు చేయాలి. లేదంటే 14 లక్షల మంది విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తాం. ఇప్పటికే రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. దీనికి విద్యార్థుల ఆగ్రహం కూడా తోడైతే ముఖ్యమంత్రి, మంత్రులు రోడ్ల పై తిరగలేని పరిస్థితి వస్తుంది" అని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోలు చేయడంలో రేవంత్ ప్రభుత్వం ఫెయిల్

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. 28 రోజులుగా వడ్లు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. పొద్దుతిరుగుడు, మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని గుర్తు చేశారు. వడ్లు పండించిన రైతులను ఈ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వడ్లు కొన్నట్లే.. ప్రస్తుతం కూడా వాటిని కొనుగోలు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు సెంటర్లు ప్రారంభించినా.. ధాన్యం కొనుగోలు జరపడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వడ్లు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. వడ్లు కొనుగోలు కోసం ఆందోళన చేస్తున్న రైతులు వడదెబ్బ కారణంగా వరి కుప్పలపై చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను పట్టించుకోని సీఎం రేవంత్ రెడ్డి రైతుబిడ్డ కాదని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

# కరీంనగర్‌లో దొంగల బీభత్సం

-మొదటిపేజీ తరువాయి

సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని కరీంనగర్ ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, ఐదుగురు సాయుధ దుండగులు కస్టమర్ల రూపంలో జువెలరీ షాపులోకి ప్రవేశించారు. బంగారు ఆభరణాలు చూపించమని కోరారు. సిబ్బంది నగలు బయటికి తీయగానే, తుపాకులతో బెదిరించి దోపిడీకి యత్నించారు. సిబ్బంది ప్రతిఘటించడంతో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో సేల్స్ మేనేజర్‌తో పాటు ఇతర ఉద్యోగులు గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిని, పోలీసు అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నట్లు బండి సంజయ్ తెలిపారు. క్షతగాత్రులకు ప్రాణాపాయం లేదని, మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ పోలీసులు తక్షణమే స్పందించారని, పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారని వివరించారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, నిందితులను పోలీసులు త్వరలోనే పట్టుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

-మొదటిపేజీ తరువాయి

పసుపు రైతులకు మంచి మద్దతు ధర లభిస్తోందంటే దానికి కారణం ప్రధాని మోదీ మాత్రమేనని స్పష్టం చేశారు. 'కేసీఆర్‌కు మతిభ్రమించింది. నమ్మిన నాయకులను మోసం చేయడం ఆయనకు అలవాటు. బీఆర్ఎస్‌లో చేరిన జీవన్‌రెడ్డిని కూడా కేసీఆర్ మోసం చేస్తారు, కేసీఆర్ శకం ముగిసిపోయింది. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ స్థాయిలో మత్తు పదార్థాలను సరఫరా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలనపై పట్టు లేదు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా మరచిపోయారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్రస్థాయిలో జాప్యం జరుగుతోంది. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను వారం రోజుల్లోగా కొనుగోలు చేయాలని బీజేపీ అల్టిమేటం జారీ చేసింది. సరైన సమయంలో కొనుగోళ్లు జరగకపోతే రాష్ట్రంలో రైతాంగం నుంచి పెద్దఎత్తున ఉద్యమం వస్తుంది' అని అన్నారు.

## ఇరాన్ డీల్ పై ట్రంప్ సమీక్ష... అయినా దాడులు తప్పవంటూ హెచ్చరిక!

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, చర్చలకు సిద్ధమంటూనే ఒత్తిడిని కొనసాగించే ద్వంద్వ వైఖరిని వాషింగ్టన్ అవలంబిస్తోంది. ఇరాన్‌పై తిరిగి దాడులు చేసే అవకాశాన్ని తోసిపుచ్చలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ అంశం పై తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో కూడా ట్రంప్ స్పందించారు. "గత 47 ఏళ్లుగా ప్రపంచానికి, మానవాళికి ఇరాన్ చేసిన నష్టానికి ఇంకా తగిన మూల్యం చెల్లించలేదు. కాబట్టి వారు పంపిన ప్రణాళిక ఆమోదయోగ్యంగా ఉంటుందని నేను ఊహించలేను" అని ఆయన పోస్ట్ చేశారు. తమ ప్రతిపాదనను పాకిస్థాన్ ద్వారా ఇరాన్ అమెరికాకు పంపింది. ఈ డీల్‌కు అంగీకరిస్తే కీలకమైన హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరిస్తామని, అమెరికా దిగ్బంధనానికి ముగింపు పలుకుతామని ఇరాన్ తెలిపింది. అయితే, తమ అణు కార్యక్రమంపై చర్చలను తదుపరి దశకు వాయిదా వేయాలని ఇరాన్ కోరుతోంది. ఈ ప్రతిపాదనను ట్రంప్ గతంలో తిరస్కరించారు. దౌత్యపరంగా చర్చలకు కట్టుబడి ఉన్నామని, కానీ ఎలాంటి సైనిక చర్యకైనా దీటుగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు.

## మధ్యప్రదేశ్ ప్రమాదంతో అప్రమత్తం.. తెలంగాణలో బోటింగ్ పై కఠిన నిబంధనలు

-మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో పర్యాటకుల రద్దీ పెరుగుతున్నందున,బోటింగ్ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఏ చిన్న పొరపాటు జరిగినా సంబంధిత యూనిట్ మేనేజర్లు, ఇన్‌ఛార్జ్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వారాంతాలు, సెలవు దినాలు, పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అధికారులు తప్పనిసరిగా బోటింగ్ యూనిట్ల వద్ద భౌతికంగా హాజరు కావాలని ఆదేశించింది. బోట్లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం (ఓవర్ లోడింగ్), ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు అందించకపోవడం వంటి ఉల్లంఘనలను ఏమాత్రం సహించేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. నిబంధనలు అతిక్రమించిన వారిపై సస్పెన్షన్‌తో సహా కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పుడు బోటింగ్ సర్వీసులను తక్షణమే నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రతి బోటింగ్ యూనిట్‌లో ప్రథమ చికిత్స కిట్లు, రెస్క్యూ పరికరాలు, అత్యవసర ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకే ఈ కొత్త మార్గదర్శకాలను జారీ చేశామని అధికారులు తెలిపారు.

## నన్ను డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది సీవీ ఆనంద్ భావోద్వేగం

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ తన తల్లిని ఉద్దేశించి భావోద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తన తల్లిని కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్న ఆయన, ఈ సందర్భంగా తన మనసులోని మాటలను పంచుకున్నారు. తన తల్లి గత నవంబర్ నుంచి జనవరి వరకు తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని, ఆ సమయంలో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. "ప్రస్తుతం అమ్మ ఆరోగ్యం మెరుగైంది, కానీ ఇంకా మంచానికే పరిమితమయ్యారు. తన కొడుకును ఈ రాష్ట్రానికి డీజీపీగా చూడాలన్న ఆమె బలమైన కోరికే, అనారోగ్యం నుంచి ఆమెను బయటపడేసిందని నేను బలంగా నమ్ముతున్నాను" అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీజీపీగా తన నియామకం గురించి తెలిసి తన తల్లి ఎంతో ఆనందపడ్డారని, ఆమె సంతోషం చూసి తానూ ఉప్పొంగిపోయానని వివరించారు. కొద్ది రోజుల క్రితమే సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాస్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

## కవిత పార్టీ పై కేఏ పాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కవిత పై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కవిత ఏర్పాటు చేసిన పార్టీపై స్పందిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. ఆమెతో పార్టీని ఎవరు పెట్టించారో అందరికీ తెలుసని, అందుకే మాజీ ప్రజాప్రతినిధులు ఎవరూ ఆ పార్టీలో చేరడం లేదని అన్నారు. అవినీతి, కుటుంబ, కుల పార్టీలను ఎవరూ నమ్మవద్దని కోరారు. ఆమె స్థాపించిన పార్టీ వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని విమర్శించారు. కేవలం తండ్రితో ఉన్న గొడవ కారణంగానే ఆమె పార్టీని ఏర్పాటు చేశారు తప్ప మరో కారణం లేదని అన్నారు. తాను అమెరికా పర్యటనలో బిజీగా ఉన్నానని, అందువల్లే తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారించలేకపోయానని పేర్కొన్నారు. గతంలో కవిత తన తండ్రిని ముఖ్యమంత్రి పదవి అడిగారని, అందుకు కేసీఆర్ నిరాకరించారని పేర్కొన్నారు. 2008లోనే కవిత తన వద్దకు వచ్చి పార్టీ కోసం రూ.10 కోట్లు ఇవ్వాలని అడిగారని, తాను రూ.15 కోట్లు ఇవ్వాలనుకున్నానని చెప్పారు. కానీ కవితకు ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని కేసీఆర్ కోరడంతో ఆగిపోయానని చెప్పారు. తన ఆస్తులను కాపాడుకోవడం కోసమే కవిత పార్టీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. దోచుకున్న డబ్బుల విషయంలో షర్మిలకు ఎలాగైతే అన్నతో విబేధాలు వచ్చాయో, కవితకు తన కుటుంబంతో అలాగే వచ్చాయని అన్నారు.

# కొదురుపాక రౌండప్ బోర్డు, మరియు బస్సు షెల్టర్, వెంకట్రావు పల్లి, బస్ షెల్టర్ నిర్మాణం,మోక్షం ఎప్పుడు

**-సిపిఎం పార్టీ డిమాండ్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 3, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం కొదురుపాక మరియు వెంకట్రావుపల్లి స్టేజీల వద్ద బస్సు సెంటర్లు నిర్మాణం చేయకపోవడం వల్ల అలాగే రౌండప్ బోర్డు సుందరీకరణ పనులకు నిర్మాణాలు చేపట్టకపోవడం వల్ల మరి ఇక్కడున్న మహిళలు బస్సు సెంటర్ లేక , టాయిలెట్, లేక,అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం కూర్చోవడానికి వసతులు లేక మహిళలు చాలా ఇబ్బంది పడుతున్న కూడా ఈ ప్రాంతం పాలకులు దృష్టి పెట్టకపోవడం అలాగే చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభివృద్ధి విషయంలో దృష్టి పెట్టకపోవడం చాలా బాధాకరమైన విషయం. మరి ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి దాదాపు రెండున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్న కూడా ఇప్పటివరకు కూడా మహిళలకు కనీస సౌకర్యాలు లేకపోవడం మరియు ఒకసారి గౌరవ ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం గారు ఆలోచించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేస్తూ ఇప్పటికైనా మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన బస్సు షెల్టర్లు



అలాగే టాయిలెట్లు, మరియు రౌండ్ బోర్డ్ సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా మహిళల పక్షాన మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ పత్రిక ముఖంగా డిమాండ్ చేయడం జరుగుతుంది. లేనిపక్షంలో పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి రహదారి నిరసన చేపడుతామని మండల సిపిఎం పార్టీ పక్షాన తెలియజేయడం జరుగుతుంది.

# గుడెప్పాడ్ జంక్షన్‌లో చలివేంద్రం ప్రారంభం





ఆత్మకూర్ :మే 3, (తెలంగాణ పత్రిక):

మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్‌లో వరసిద్ధు వాటర్ ప్లాంట్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గుడెప్పాడ్, కామారం గ్రామాల సర్పంచులు పరికి రమేష్ బాబు, తోట కుమారస్వామి ప్రారంభించారు. సర్పంచ్ పరికి రమేష్ బాబు మాట్లాడుతూ, తీవ్రమైన వేసవిలో ప్రయాణికులకు నీరు అందించడం అభినందనీయమని అన్నారు. కామారం సర్పంచ్ తోట కుమారస్వామి మాట్లాడుతూ, రోజూ వేలాది మంది ప్రయాణికులకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బూర వరుణ్ గౌడ్, చందు గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సహకారంతోనే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. చలివేంద్రం ఏర్పాటు పట్ల ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

# స్వేచ్ఛ యువతమైన పత్రికలే ప్రజాస్వామ్యానికి పునాదులు

**-ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా.......**

**-సీనియర్ జర్నలిస్టు 10టీవీ నర్సంపేట రిపోర్టర్ పోనగంటి స్వామికి ఘన సన్మానం..........**

నర్సంపేట మే 03 తెలంగాణ పత్రిక

ప్రెస్ దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని దీక్షకుంట గ్రామంలో హనుమాన్ మాల దీక్ష స్వాముల ఆధ్వర్యంలో జర్నలిస్టు దినోత్సవం ఘనంగా నిర్వహించారు... ఈరోజు జర్నలిస్ట్ గురుస్వాములు అందేశ్వర స్వామి, కోల ప్రవీణ్ స్వామి సీనియర్ జర్నలిస్ట్ 10టీవీ నర్సంపేట రిపోర్టర్ పోనగంటి స్వామి రావు ను ఘనంగా పూలమాలవేసి శాలువతో సన్మానించారు.. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గురు స్వామి ఆలకుంట సురేందర్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా జర్నలిజమైన దేహంగా సమాజంలో ఏదో ఒక సేవ చేయాలంటూ మండల స్థాయి రిపోర్టర్ నుంచి జిల్లా స్థాయి రిపోర్టర్ వరకు



అంచలంచెలుగా ఎదిగిన సీనియర్ జర్నలిస్టు పొనగంటి స్వామి అని సమాజ సేవలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్త సేకరణ చేస్తూ ప్రజలకు వారధిగా ఉంటున్నాడు అతనికి జర్నలిస్టు రోజు శుభాకాంక్షలు తెలుపుతూ అతనినీ సన్మానించడం జరుగుతుంది.. ఈ కార్యక్రమంలో దొరికిన రమేష్ చీపురు మల్లయ్య ప్రశాంత్ సూర్యప్రకాష్, మూడు ప్రేమాకర్ సిద్దు అనిల్, దుర్గయ్య, సురేష్ శివ తదితరులు పాల్గొన్నారు...

# మే 6న జరిగే రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలి





**-మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**

నర్సంపేట మే 03 తెలంగాణ పత్రిక

రైతు సదస్సు పోస్టర్ ను ఆవిష్కరించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ..ఉదయం 8 గంటలకు సభాప్రంగణంకు చేరుకోవాలి, పార్టీ ప్రతినిధులు, రైతులతో ఈ సదస్సును నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. హనుమకొండ హంటర్ రోడ్డులో మే 6న బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నా రైతుసదసుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు, కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ పేట్టి రైతులకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను మోసం చేసింది, రైతు భరోసా, రైతు రుణమాఫీ, బోనస్, ధాన్య శీ కొనుగోలు ఇలా అనేకరకాలైన హామీలతో రైతులను మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతులకు యూరియా కష్టాలు కరెంటు కష్టాలు సాగునీటి కష్టాలు ధాన్యం కొనుగోలు కష్టాలు అనేక రకాలుగా రైతులను కాంగ్రెస్ పార్టీ కష్టాలపాలు చేసింది. ,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు, 6గ్యారంటీలతో రైతులను, రైతు కూలీలను, మహిళలను, యువకులను, వృద్ధులను నమ్మించి మోసం చేసింది. నాటి కెసిఆర్ పాలనలో రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది ,నేడు కాంగ్రెస్ పార్టీ రైతులను కష్టాలపాలు చేసింది. ప్రతిపక్షాల సమావేశాలకు పోటీగా అధికార పార్టీ సమావేశాలు పెట్టి, బి ఆర్ ఎస్ పార్టీ గొంతునొక్కలని చూస్తున్నాడు...ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర డైరెక్టర్, ఒడిసి ఎమ్మెస్ ఛైర్మెన్, నియోజకవర్గ కో ఆర్డినేటర్, మండల పార్టీ కన్వీనర్,మాజీ జడ్పీటీసీ మాజీ ఎంపీపీ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, రూరల్ పార్టీ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ బాధ్యులు, కాన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ పార్టీ బాధ్యులు, సర్పంచ్, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు ,వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు...

## ప్రమాధవశాత్తు తాటి చెట్టు పై నుండి పడి మృతి చెందిన గీత కార్మికుడు కుటుంబాన్ని ఆదుకోవాలి

**-జిల్లా కళ్ళుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఎలుగూరి గోవింద్**

**-రాష్ట్ర కమిటీ సభ్యుడు గుణగంటి కృష్ణ**

సూర్యాపేట, తెలంగాణ పత్రిక ,మే 3



సూర్యాపేట మండలం కాసరబాద గ్రామంలో పోల గాని శ్రీను o/శీ భిక్షం 48 సంవత్సరాల వయసు,రోజువారీగా ఉదయం 6:30 గంటలకు తాటి చెట్టు ఎక్కగాప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందారు అతనికి భార్య ఇద్దరు పిల్లలు వారు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు ఇంటి పెద్దని కోల్పోయి దీనస్థితిలో ఉన్నారు వారికి వెంటనే ప్రభుత్వం ఎక్స్గ్రేషియో పది లక్షల రూపాయలు ఇవ్వాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్గూరి గోవిందు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన వృత్తి చేతబట్టి ఇంటికి వచ్చేదాకా ఎంతో ఇబ్బందులు గురయ్యాయే గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.వారి వెంట కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుణగంటి కృష్ణ జిల్లా కమిటీ సభ్యులు మరియు సొసైటీ అధ్యక్షులు రాచకొండ నాగరాజు గంగాధరి వెంకన్న కొల్లు బుచ్చయ్య గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గీత కార్మికులు గ్రామస్తులు ఉన్నారు.

## అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న లారీలు జేసీబీ ను సీజ్ చేసిన జిల్లా పోలీసులు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 3

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఆదివారం ఉదయం ఐదు లారీలు,ఒక జేసిబీ ను జిల్లా పోలీసులు సీజ్ చేయడం జరిగింది.పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు లారీలను,దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక లారీ,బూర్గంపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు లారీలు ఒక జెసీబీను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సంబంధిత శాఖాధికారులతో సమన్వయం పాటిస్తూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పట్టుబడిన ఇసుక అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**-జిల్లా కలెక్టర్ అంకిత్.**

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 3



సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.


## అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు

పరకాల/గీసుకొండ/మే 03 తెలంగాణ పత్రిక



రాంపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం ప్రతిష్టాపన కార్యక్రమం కోసం గ్రామ ప్రముఖులు, దాతలు ఉదారంగా విరాళాలు అందజేశారు.ఈ సందర్భంగా ముందుగా కత్తి వెంకటేశ్వర్లు రూ. 25,000/- విరాళాన్ని అందజేశారు. అనంతరం వరిగల రాజు రూ. 10,116/- విరాళాన్ని సమర్పించారు. గాజుర్ల రవి రూ. 10,116/- విరాళం అందజేశారు.తదుపరి రడం కనకరాజు రూ. 10,016/- దర్శనాల చిన్న కుమార్ రూ. 2,000/- విరాళాలను అందజేశారు. డాక్టర్ తుప్పరి నరసింహస్వామి రూ. 10,016/- విరాళాన్ని సమర్పించారు.అలాగే ఈనాడు రిపోర్టర్ కొల కృష్ణమూర్తి రూ. 10,116/- పాకాల ప్రభాకర్ శర్మ రూ. 10,016/- విరాళాలను అందజేశారు.ఈ విరాళాలను రాంపూర్ గ్రామ సర్పంచ్ రడం భరత్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి గుడి చైర్మన్ తాబేటి వెంకటేశ్వర్లు చేతులకు అందజేయడం జరిగింది. ఆదివారం రోజు మొత్తం అందిన విరాళం: : రూ. 87,396/-ఈ సందర్భంగా గ్రామస్థులు దాతల సేవాభావాన్ని అభినందిస్తూ, అభయ ఆంజనేయ స్వామి ఆశీస్సులు వారికి ఎల్లప్పుడూ ఉండాలని, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.గ్రామ అభివృద్ధి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో అందరూ కలిసికట్టుగా ముందుకు రావడం శుభపరిణామమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# నియోజకవర్గం వ్యాప్తంగా పలు వివాహాలు శుభకార్యలలో పాల్గొన్న జానారెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



మిర్యాలగూడ ప్రతినిధి//మే 3:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ నియోజకవర్గం వ్యాప్తంగా పలు వివాహాది శుభకార్యాలలో సీనియర్ నాయకులు మాజీ సీఎల్పీ నేత కుందూర్ జానారెడ్డి, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు పాల్గొని నూతన వధూవరులను అక్షంతలు వేసి ఆశీర్వధించారు. అనంతరం వారికి పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వారితో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు మరియు బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# భాధ్యతలు స్వీకరించిన అడ్వకేట్ భానుప్రియ




భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక మే 3

ఇండియన్ లీగల్ ప్రొఫేషనల్స్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా నియమితులైన అడ్వకేట్ సుంకర భానుప్రియ భాధ్యతలు స్వీకరించారు. నేడు హైదరాబాద్ లోని సమతా నాలేడ్జ్ సెంటర్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు యన్.జే. సాంమ్సన్ నియమకపు పత్రం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో భానుప్రియ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, డా.బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం తో ఆవిర్భావించిన ఐ.యల్.పి.ఏ దేశం కోసం, రాజ్యాంగం కోసం పనిచేస్తుందని న్యాయవాదులకు వృత్తి నైపుణ్యం లో శిక్షణతో పాటు, న్యాయవాదుల సమస్యలు పరిష్కరం కోసం ఐ.యల్.పి.ఏ. పని చేస్తుందని తెలిపారు. తనపై నమ్మకం తో తనకు జాతీయ స్థాయి పదవి ఇచ్చినందుకు జాతీయ అధ్యక్షురాలు సుజాత ఛౌడంటే, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు యన్.జే.సాంమ్సన్ కు భానుప్రియ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లీగల్ ప్రొఫేషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణ రెడ్డి, మారపాక రమేష్, మహమ్మద్ సాదిక్ పాషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జనపరెడ్డి గోపి కృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దోడ్డ సామంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ లక్ష్మి, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ స్థాయిలలో ప్రజావాణి నిర్వహించాలి
# జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

-ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే డివిజన్ స్థాయి ప్రజావాణి

వరంగల్ జిల్లా ప్రతినిధి మే 03 తెలంగాణ పత్రిక



ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ప్రజావాణి" కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే డివిజన్ స్థాయి ప్రజావాణి ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడమైనదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించడం జరుగు తుందన్నది అందరికీ తెలిసిన విషయమైనప్పటికి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్‌డీవో కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని కలెక్టర్ అన్నారు.అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు జిల్లా స్థాయిలో. డివిజన్ స్థాయి అధికారులు డివిజన్ స్థాయిలో జరిగే ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై, ప్రజల వినతులను స్వీకరించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజల ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, ప్రతి వినతికి ప్రత్యేక ధృవీకరణ నంబర్ కేటాయించ బడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అందిన ఫిర్యాదులను 30 రోజులలోపు పరిష్కరించి, తీసుకున్న చర్యల నివేదికలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు.జిల్లా కలెక్టరేట్ మరియు రెవెన్యూ డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయిలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని, అధికారులు ప్రజల పట్ల నిబద్ధత తో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రక్టల ద్వారా తెలిపారు.

# ఇటుకాలపల్లి లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

-మక్కల కొనుగోలు కేంద్రాలు పెంచాలి....మండల పార్టీ డిమాండ్.

నర్సంపేట మే 03 తెలంగాణ పత్రిక



నర్సంపేట రూరల్ మండలంలోని ఆకుల తండా గ్రామంలో రైతులు ఆరబోసిన మక్కలను బిఆర్ ఎస్ మండల నాయకులు పరిశీలించారు.ఈ యొక్క సమావేశం లో మండల కన్వీనర్ కొమళ్ల గోపాల్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహ రాములు మాట్లాడుతు గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారం తో మాజీ ఎం.ఎల్.ఏ పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట నియోజకవర్గం లో 42 కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేసి రైతులకు మక్కల కొనుగోలు లో ఇబ్బంది లేకుండ చూసుకున్నారని తెలిపారు.ప్రస్తుతం నియోజకవర్గం మొత్తం లో కేవలం 6 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేసి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుంది అని విమర్శించారు.వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను పెంచాలని డిమాండ్ చేశారు.ఇటుకాలపల్లి మరియు సమీప గ్రామంలో చాలా పెద్ద ఎత్తున రైతులు మొక్కలు సాగు చేశారని ఇటుకాలపల్లి లో మొక్కలు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జి లు కోడారి రవి,మోటురి రవి,భూక్య వీరన్న,సర్పంచ్ కూకట్ల రవి,వళ్ళల కర్ణకార్, భూక్య వీరు నాయక్ విద్యా కమిటీ మాజీ చైర్మన్ తాళ్ల పెల్లి అశోక్, రావవరం గ్రామ పార్టీ అధ్యక్షులు జీనుకల విజేందర్, నాయకులు బొడిగె వినయ్, లకిడే రాజేశ్వరరావు, దోనికల కుమార్, పాసికంటి శంకర్ లింగం,మండల రాజమౌళి,వాడికారి గోపాల్, ఉప్పునూతల విరాచారి , బోయిని సమ్మలు మూడు బిఖ్య,కర్దూరి హరీష్,మాజీ ఉపసర్పంచ్ జమాల్ల చంద్రమౌళి,ఊరటి శీను,అజయ్ బాబు,పిట్టల సురేందర్, దేశిని రవి,పుల్లేరావు సాంబయ్య,గజ్జి మహేష్, గజ్జి బాబు, రతపురం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఇందుగుల గ్రామంలో నాణ్యతలేని సిసి రోడ్లు నిర్మాణం





-నిర్ణీత మోతాదులో ఇసుక వాడాలనే ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి పూర్తిగా కంకర డస్ట్ వాడకం

-రోడ్డు పనులు జరుగుతున్న కన్నెత్తి కూడా చూడని ఆర్ అండ్ బి అధికారులు

మాడ్గులపల్లి//నల్గొండ//మే 3:(తెలంగాణ పత్రిక):-

మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నశిరాకంగా రోడ్డు ను కాంట్రాక్టర్ ఇష్టను రీతిగా నిర్మాణ పనులు సాగిస్తున్నారు. రోడ్డు పనులు చేయిస్తున్న సూపర్వైజర్ ను మీడియా ప్రతినిధి కలసి రోడ్డు నిర్మాణ పనులు ఏ విధంగా జరుగుతున్నాయని అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఎలాంటి సమాధానం చెప్పకపోగ పొంతనలేని సమాధానాలు, మీరు అక్కడికెళ్లి చూసుకోండి. మీరు ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. మేము ఇంతే చేస్తాం మీరేం రాసుకుంటారో రాసుకోండి అని అనడం జరిగింది. ఇటీవల ఈ రోడ్డు పనులలో రోడ్డు నాణ్యత విషయంలో జరుగుతున్న ఘోరమైన అవినీతి మాత్రం అధికారులు చూస్తూ చూడనట్లు వదిలేయడం వెనక ఉన్న లోగోట్టు ఏమిటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సిసి రోడ్ల నిర్మాణంలో నిర్ణీత మోతాదులో ఇసుకను వాడాలనే ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి రోడ్డు నిర్మాణంలో ఇసుక జాడ ఎక్కడ కనిపించదు లేదు, ఇసుక ఖరీదు ఎక్కువ అవుతుందని ఉద్దేశంతో సదరు కాంట్రాక్టర్ పూర్తిగా కంకర డస్ట్ వాడుతూ పని పూర్తి చేస్తున్నారు. పేరుకు ఇసుక పక్కన పోసి పూర్తిగా డస్ట్ వాడకని చేస్తున్నారు. దస్టుతో వేసే రోడ్లు కేవలం కొన్ని నెలలకే పగలుడు వచ్చి కంకర తేలటం వర్షానికి కృంగిపోతాయని తెలిసిన సంబంధిత ఇంజనీర్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనహరం. అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమిషన్ల మత్తులో ఉన్నారా లేక కాంట్రాక్టర్లే అధికారులను శశిస్తున్నారా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజల సొమ్ముతో నిర్మించే రోడ్డు నాణ్యత లేకపోతే ఆ నష్టానికి బాధ్యులు ఎవరు? పనులు జరుగుతున్న సమయంలో నిలబడి పర్యవేక్షించాల్సిన ఏ ఒక్క అధికారి కూడా క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం శోచనీయం. ఇందుగుల రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న అక్రమాలను తక్షణమే అరికట్టాలి క్వాలిటీ కంట్రోల్ అధికారులు స్పందించి నిర్మాణ నమూనాలను సేకరించి పర్యవేక్షించాలి నాణ్యతలేని డస్ట్ వాడకాన్ని నిలిపివేసి నిబంధనల ప్రకారం ఇసుకతో పనులు చేయించాలి అధికారుల నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే గ్రామస్తులతో కలిసి ఉన్నతాధికారులు కార్యాలయం ముట్టడిస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులైన అధికారులను కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


# అమ్మ... వన దుర్గమ్మ.. చల్లంగా చూడమ్మా

-ఆదివారం భక్తులతో జనసంద్రమైన ఏడుపాయల క్షేత్రం

-వన దుర్గమ్మకు పలు మొక్కులు చెల్లించుకున్న భక్తులు

-మంజీరా లో పుణ్యస్నానమాచరించి అమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

పాపన్నపేట, ప్రతినిధి మే 3:(తెలంగాణ పత్రిక)





ఎటు చూసినా జనమే జనం.. అందరిలో భక్తి భావం.. ఆధ్యాత్మిక వాతావరణం ఆలయం చుట్టూ పచ్చని చెట్లు, గలగల పారే గంగమ్మ పరవళ్ళు.. ప్రకృతి ఒడిలో సేద తీరుతున్నామనిపించే వాతావరణం..ఇది ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వన దుర్గామాత క్షేత్రం ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయల భక్తులతో జనసంద్రమైంది. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. ఆలయ అర్చకులు వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వన దుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. చెక్ డ్యామ్, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నది పాయలో పుణ్యస్నానాలు ఆచరించి వన దుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుళ్ల మధ్య బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఏడుపాయల వన దుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. చల్లంగా చూడమ్మా.. వన దుర్గమ్మ తల్లి అంటూ భక్తులు అమ్మవారిని వేడుకన్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

# కలం శక్తికి వందనం -- జర్నలిస్టులకు బహుజన్ సమాజ్ పార్టీ నేత శుభాకాంక్షలు

-నిజం కోసం పోరాడే జర్నలిస్టులు సమాజానికి దారిదీపం

భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ 03మే (తెలంగాణ పత్రిక)

జర్నలిస్టుల సేవలు సమాజానికి అమూల్యమని బహుజన్ సమాజ్ పార్టీ నేత కురిమెళ్ల శంకర్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిజం కీలక పాత్ర పోషిస్తోందని, నిజాన్ని వెలికితీసి ప్రజల ముందుకు తీసుకువచ్చే బాధ్యత జర్నలిస్టులపై ఉందని ఆయన పేర్కొన్నారు. కలం అనేది కేవలం రాయడానికి ఉపయోగించే సాధనం మాత్రమే కాదు, అది అన్యాయం, అవినీతిపై పోరాడే శక్తివంతమైన ఆయుధమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఎల్లప్పుడూ ప్రశంసనీయం అని అన్నారు. ప్రస్తుతం వేగంగా మారుతున్న సమాచార యుగంలో నిజమైన వార్తలు అందించడం ఒక పెద్ద సవాలుగా మారిందని, అయినప్పటికీ జర్నలిస్టులు నిష్పక్షపాతంగా తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారని ఆయన కొనియాడారు. ఫీల్డ్‌లో అనేక ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పని చేస్తున్న జర్నలిస్టులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జర్నలిస్టులకు "పెన్"ను ప్రతీకగా తీసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తూ, కలం పట్టిన ప్రతి జర్నలిస్టు సమాజానికి మార్గదర్శకుడిగా నిలవాలని ఆకాంక్షించారు.

-ముగింపు:



సత్యం కోసం నిలబడే జర్నలిస్టులు సమాజానికి బలమైన స్థంభమని, వారి కృషి ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరుస్తుందని కురిమెళ్ల శంకర్ పేర్కొన్నారు.

# ఎలాంటి నిబంధన లేకుండా కుట్టు మిషన్లు రుణాలు అందించాలి




నల్లబెల్లి మే 03 తెలంగాణ పత్రిక

సకల కులాల్లోని పేద మహిళా టైలర్లకు ఎలాంటి నిబంధనలు లేకుండా కుట్టు మిషన్లు, ఋణాలు అందించాలి. చింతకింది కుమారస్వామి (సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు). బీసీ సంక్షేమ శాఖ ద్వారా బీసీ ముస్లిం నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి పథకం ద్వారా 100% సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఓసిలలోని పేద మహిళా టైలర్లందరికీ ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించాలనీ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అన్నారు. మండల కేంద్రమైన నల్లబెల్లిలోని సుమంగళి ఫంక్షన్ హాల్ లో జరిగిన కుట్టుమిషన్ మహిళా వృత్తి దారుల సమావేశానికి సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య అధ్యక్షత వహించగా కుమారస్వామి మాట్లాడుతూ, కుట్టు మిషన్ శిక్షణలో సర్టిఫికెట్ పొందిన వారు, వితంతువులు నిరుపేదలకు నియోజకవర్గానికి పూర్తి సబ్సిడీతో 1000 ఆటోమెటిక్ కుట్టు మిషన్లు అందించనున్నట్టు ఎప్రిల్ 27 న ప్రభుత్వం నిర్ణయించినట్టు అందుకోసం త్వరలో అధికారికంగా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు కోరనున్నట్లు పత్రికల ద్వారా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ పథకాన్ని సిపిఐ ఆహ్వానిస్తున్నదనీ అదే క్రమంలో నియోజకవర్గానికి 1000మంది బీసీలకు మాత్రమే కాకుండా ఎస్సీ ఎస్టీ ఓసిలలోని నిరుపేద మహిళా కుట్టు మిషన్ వృత్తి దారులందరికీ సంఖ్యతో సంబంధం లేకుండా ఈ పథకాన్ని వర్తింపచేయాలనీ అన్నారు. సర్టిఫికెట్ లు ఉన్నా లేకున్నా, స్టిచ్చింగ్ చేస్తున్న మహిళలందరికీ ఈ పథకం వర్తింపచేయాలన్నారు. మహిళా టైలర్లందరికీ క్లాత్ ,స్టిచ్చింగ్ మెటేరియల్ కోసం ప్రభుత్వమే ష్యూరిటిగా బ్యాంకుల ద్వారా లక్షరూపాయల వరకు సబ్సిడీ ఋణాలు అందించి మహిళా టైలర్ వృత్తిని బలోపేతం చేయాలన్నారు.మహిళా టైలర్ నాయకురాలు కత్తి రమా మాట్లాడుతూ, ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు కుట్టించే డ్రెస్ లకు ఇచ్చే 70/-లతో మహిళలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు.చిన్న పిల్లల డ్రెస్ లకు య100/-రూలు పది సంవత్సరాల పైనున్న విద్యార్థులకు 200/-రూలు చెల్లిస్తేనే ప్రభుత్వం చెప్పే స్వయం ఉపాధి పథకానికి అర్థం ఉంటుందన్నారు. భవిష్యత్ కార్యాచరణ కోసం ఏఐటీయూసీ అనుబంధ చేతివృత్తి దారుల సంఘం మండల కమిటీ వేశారు గౌరవ అధ్యక్షురాలుగా ఓదేల కవిత అధ్యక్షులుగా దిండు మమత ఉపాధ్యక్షులుగా కోడూరి కవిత రావుల అనిత ప్రధాన కార్యదర్శిగా కత్తి రమా కార్యదర్శులుగా అనంతగిరి సునిత మంద కళ్యాణి కంపెల్లి భారత కోశాధికారిగా జంపాల లావణ్య సభ్యులుగా కీసరి అనిత యార రజిత అడ్డగట్ల భవాని వేముల నవ్య కోడూరి సుప్రియ తదితరులతో మండల కమిటీ వేశారు ఈ సమావేశంలో సిపిఐ రైతు సంఘం మండల కార్యదర్శి మామిండ్ల పెద్ద అయిలయ్య, మండల నాయకులు పరికి కోర్నేలు, ఓదెల రవి తదితరులు పాల్గొన్నారు

# క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి





పాపన్నపేట, ప్రతినిధి మే 03:(తెలంగాణ పత్రిక )

మద్యానికి బానిసై మనస్థాపంతో క్రిమిసంహారక మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...గ్రామానికి చెందిన శ్రీరాం సాయిలు(48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.కొన్ని రోజుల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు.రెండు రోజుల క్రితం చుట్టాల ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆదివారం తన వ్యవసాయ పొలంలో క్రిమిసంహారక మందు సేవించి వాంతులు చేసుకుంటూ కింద పడి ఉండగా అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు.కుటుంబీకులు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు అక్కడ డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు చెప్పారు.మృతుడి కొడుకు సాయిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో నీట్ పరీక్షలు

-465 పరీక్షలకు హాజరు, 14 మంది గైర్హాజరు.
-పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి

మెదక్ జిల్లాప్రతినిధి (తెలంగాణ పత్రిక) 03 మే

జిల్లాలో నిర్వహించిన నీట్ పరీక్ష ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరిగిందని అదనపు కలెక్టర్ నగేష్ , మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు.ఆదివారం జిల్లాలో నీట్ పరీక్ష జరుగుతున్న మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, నీట్ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు,ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ వినియోగించిన విధానాన్ని పరిశీలించి అలాగే పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరు అయ్యారు ,గైర్హాజరు శాతం వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.ఈ పరీక్షకు మొత్తం 479 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 465 హాజరయ్యారని, 14 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి అంతరాయం, సమస్యలు ఉత్పన్నం కలుగకుండా ఇన్విజిలేటర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాల నిఘాతోపాటు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్ష పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా ఇతరులను



పరీక్షా కేంద్రాలలోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు.మెదక్ ఆర్డీవో రమాదేవి నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్డీవో వెంట తాసిల్దార్ లక్ష్మణ్ బాబు నీట్ పరీక్ష కేంద్ర నిర్వాహకులు ఇతర పోలీసు అధికారులు, నీట్ , ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గోదాములు లేవు.. గోనె సంచులు రావు.. ప్రశ్నిస్తే విమర్శలా

-గోదాముల్లో చోటు లేదు.. పాలకుల్లో తెలివి లేదు!
-మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ని విమర్శించే ముందు మీ చేతకానితనం చూసుకోండి ..
-మొక్కజొన్నకే ఇన్ని తిప్పలా.. వరి కోతలు వస్తే రైతుల గతేంటి?
-బిఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్..

నర్సంపేట/చెన్నారావుపేట/మే 03 తెలంగాణ పత్రిక

అన్నదాత ఆక్రందన ఒకవైపు...పాలకుల నిర్లక్ష్యం మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న రైతులు కన్నీరు పెడుతుంటే వారి పక్షాన నిలబడిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పై విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల నీచ రాజకీయాలకు పరాకాష్ట అని మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్ మండిపడ్డారు.

**-పోరాటం రాజకీయం ఎలా అవుతుంది?**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్ మాట్లాడుతూ... అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి ఎదురు దాడి చేయడం కాంగ్రెస్ మార్క్ రాజకీయమంటూ.. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తప్ప అని వారు ప్రశ్నించారు ఎండనక వాన అనక కష్టపడి రైతు పక్షాన నిలబడి వారి సమస్యలపై గొంతెత్తుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పై బురద చల్లడం సిగ్గుచేటని మండిపడ్డారు.గోదాములు ఖాళీ చేసే తెలివి లేదు.. గోదాములు నిండు.. రైతు కళ్ళు ఎండు!మండలంలో కొనుగోలు చేసిన మొక్కజొన్నలను స్టాక్ చేయడానికి కనీసం గోదాములు కూడా సిద్ధం చేయలేని అసమర్థ స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని గోదాముల్లో ఉన్న పాతధాన్యాన్ని ఖాళీ చేయించాలని కనీస ఆలోచన లేక కొనుగోళ్లు నిలిచిపోతున్నాయని, మరోవైపు గోనె సంచుల కొరతతో రైతులు కల్లాల వద్ద నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**-నెరవేర్చలేని హామీలు..**

పగ్గాలు చేపట్టి రెండున్నర ఏళ్లు దాటిన ఇప్పటికీ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. రైతు భరోసా కింద 15 వేలు ఇస్తామని వ్యవసాయ కూలీలకు 12 వేలు ప్రకటించిన కాంగ్రెస్ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. రుణమాఫీ సైతం పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత అడ్రస్ లేకుండా పోయిన రైతు ఆత్మహత్యలు.. కాంగ్రెస్ పాలనలో తిరిగి ప్రారంభమయ్యాయని కరెంటు కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.ప్రశ్నిస్తేనే పాలకుల్లో కదలిక.. రైతులకు న్యాయం, రైతు కష్టాన్ని చూసి చెలించి ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ని విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. మీ పనులు మీరు సక్రమంగా చేస్తే



ఆయన ఎందుకు ప్రశ్నిస్తారు మొక్కజొన్నకే ఈ పరిస్థితి ఉంటే రేపు వరి కోతలు మొదలయ్యాక రైతులను ఇంకెన్ని కష్టాలకు గురిచేస్తారో ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు మీకు అంత పౌరుషం ఉంటే విమర్శలు మానేసి వెంటనే కేంద్రాల్లో ఉన్న మొక్కజొన్నలు కొనుగోలు చేసి చూపించండి ప్రజలకు న్యాయం జరగాలంటే ప్రశ్నించే గొంతుక ఉండాలని ఆ గొంతు నొక్కాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. ప్రజలంతా ప్రభుత్వ వైఫల్యాన్ని గమనిస్తున్నారు. నాడైనా నేడైనా రైతు పక్షాన ఆర్ఎస్ పోరాడుతు ఒదన్నారు చేతగానితనాన్ని ప్రశ్నించినందుకు విమర్శలకు దిగితే సహించేది లేదన్నారు. ప్రజలంతా ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని వారే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

# అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం



ఇల్లంతకుంట మే 3 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం 2002-2003 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది.22 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులు ఒకే వేదికపై కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ అనుభవాలను పంచుకుంటూ పాఠశాల నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న, మృతి చెందిన తోటి స్నేహితుల కుటుంబాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు 2003 బ్యాచ్ పేరిట రూ.18,500 విలువైన సౌండ్ సిస్టమ్‌ను విరాళంగా అందించారు. ప్రార్థన సమయంలో పాఠశాలకు ఉపయోగపడుతుందని హాజరైన పూర్వ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని అందరూ ముక్తకంఠంతో తీర్మానించారు.అలనాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం అప్పటి గురువులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పూర్వ గురువులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ ఒకే చోట కలుసుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు దూస గోవర్ధన్, పూర్వ ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకన్న, పావని, తిరుమల, శారద, భూపతి, కవిత, శ్రీనివాస్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వరకట్నం వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య.

రాజేంద్రనగర్ ప్రతినిధి మే 03 తెలంగాణ పత్రిక.

గృహిణి వరకట్నపు వేధింపులు భరించలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సాకు చెందిన చందన్ కుమార్ దీపాంజలి దంపతులు మల్కారంలో ఓ షెడ్డులో పేపర్ ప్లేట్లు తయారు చేస్తూ గోదాం వెనకలే ఉన్న రూమ్ లో ఉండేవారు. తరచు భర్త, అత్త వరకట్నపు కోసం వేధించే వారని తట్టుకోలేక దీపాంజలి ఆత్మహత్యకు పాల్పడినట్లు దీపాంజలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించారు.

## మేడవరం లోపెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



కామారెడ్డి, మే 03, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలో ని యాడారం గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా శ్రీ వన దుర్గ పెద్దమ్మతల్లి నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు మరియు అమ్మవారి ప్రతిష్టాపన ప్రాణ ప్రతిష్ట మరియు హోమం కార్యక్రమం నిర్వహిస్తున్నారు అదేవిధంగా ఒగ్గు కళాకారుల చేత ఒగ్గు కథ కార్యక్రమం నిర్వహించబడును తర్వాత రోజు పోచమ్మ బోనాలు మరియు మరునాడు పెద్దమ్మ బోనాలు అనంతరం శ్రీ పెద్దమ్మ పెద్దరాజుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా ఉంటుందని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మండల ప్రజలకు మా యాడారం ముదిరాజ్ సదర్ సంఘం తరపునుంచి ప్రతి ఒక్కరికి ఆహ్వానం తెలుపుతున్నామని శ్రీ వనదుర్గ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పట్ల ఉండాలని యాడారం ముద్రాజ్ సదర్ సంఘము సభ్యులు తెలిపారు.

## ఈ దురుగాలులకు చెట్టు కూలి చనిపోయిన గేదే

మాడుగులపల్లి//నల్గొండ//మే 3:(తెలంగాణ పత్రిక):-



మాడుగులపల్లి మండలం ఆగమోత్కూర్ గ్రామనికి చెందిన పల్ల శ్రీను అనే రైతు తన గేదెను ఇంటి ముందర ఉన్న వేప చెట్టుకు కట్టేయడంతో ఆదివారం రోజు సాయంత్రం విచిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి అయొక్క వేప చెట్లు కూలి బర్రెపై పడటంతో ఆ యొక్క గేదె అక్కడికక్కడే మరణించడం జరిగింది. అతను బయటికి వెళ్లి చూడగా అప్పటికే బర్రె మరణించడం జరిగింది. ఆ యొక్క గేదె విలువ 50వేయిలు ఉంటుంది కావున ఆ యొక్క రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# శుభకార్యంలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ రాష్ట్ర యువ నాయకులు గంప శశాంక్



భిక్కనూరు మే 03 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

మండల కేంద్రంలో ఎస్ వి గార్డెన్ లో బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మునిగాల రాజేశ్వర్ గౌడ్ గారి కుమారుని పుట్టు పంచల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కామారెడ్డి మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్ తనయుడు బి.ఆర్.ఎస్ రాష్ట్రయువ నాయకులు గంప శశాంక్ వేడుకల్లో పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు,ఈ క్రమంలో భిక్కనూరు మాజీ సర్పంచ్ తునికి వేణు దంపతులు,మాజీ ఉపసర్పంచ్ బోడ నరేష్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అందె మహేందర్ రెడ్డి,పార్టీ నాయకులు అంబల్ల మల్లేశం,రంజిత్ వర్మ,కర్రోల రాజు,గంగల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి

- హెచ్చరిక మండల పరిధిలోని రైతులందరూ
- వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున
- మొక్కజొన్న వరి ఇతర పంటలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- గీసుకొండ సిఐ విశ్వేశ్వర్




పరకాల/గీసుకొండ/ మే 03 తెలంగాణ పత్రిక

రాబోయే 24 గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల కోయబడిన మొక్కజొన్న, వరి  ఇతర పంటలు వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాం. వ్యవసాయ క్షేత్రాల దగ్గర జాగ్రత్తగా ఉండాల్సిందిగా విద్యుత్ ఇతర ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అంతేకాక వ్యవసాయ పనిముట్లను వస్తువులను జాగ్రత్తగా దాచుకోవాల్సిందిగా కోరుకుంటూ అందరూ తగు జాగ్రత్తలు పాటించి పంట నష్టాన్ని నివారించగలరు.సి.ఐ విశ్వేశ్వర్, గీసుగొండ.

# భిక్కనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నరేందర్ రెడ్డి నియామకం



భిక్కనూరు మే 03 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

భిక్కనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా సీనియర్ నాయకులు ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన నాగన్నగారి నరేందర్ రెడ్డిని నియమిస్తూ, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు,ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఒక కార్యకర్త నుంచి పలు పదవులలో కొనసాగుతూ నమ్ముకున్న తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీకి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి,అధిష్టానం ఈఅవకాశం ఇచ్చినందుకు పార్టీ సిద్ధాంతాల కు కట్టుబడి పార్టీ కార్యకర్తలను అందరిని కలుపుకొని ముందుకెళ్తనని ఈసందర్భంగా తెలిపారు.వారి ఎన్నిక పట్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తపరిచారు.

# ప్రధాని మోదీ సభ పేరు మార్పు జనా గ్రహం తీసేయమన్న పీఎంవో

- అధికారిక పర్యటనల విషయంలో పీఎంవో ఎంత నిశితంగా వ్యవహరిస్తుందో ఈ ఘటన స్పష్టం.
- ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు తక్షణమే రాష్ట్ర బీజేపీ స్పందించింది
- ఇదిలావుంటే, మే 10వ తేదీన ప్రధాని మోదీ షెడ్యూల్ అత్యంత బిజీ!



తెలంగాణ పత్రిక ,మే 3

తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ తొలుత ఈ సభకు జనాగ్రహ సభ అని పేరు పెట్టింది. సాధారణంగా జనాగ్రహం అనే పదాన్ని రాజకీయ పోరాటాలు, నిరసనలు లేదా ప్రభుత్వ వ్యతిరేకతను వ్యక్తం చేసే సందర్భాల్లో వాడుతుంటారు గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లు వంటి అంశాల పై ప్రతిపక్షాల తీరును నిరసిస్తూ బీజేపీ దేశవ్యాప్తంగా ఈ పేరుతో కార్యక్రమాలు చేపట్టింది. అయితే, ఈసారి మోదీ పర్యటన కేవలం రాజకీయ సభకే పరిమితం కాలేదు. ఆయన హైదరాబాద్‌లో సుమారు 8 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఒక పక్క అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు, ఆగ్రహం అనే ప్రతికూల అర్థం వచ్చే పేరుతో సభ నిర్వహించడం సముచితం కాదని ప్రధానమంత్రి కార్యాలయం అభిప్రాయ పడింది. సానుకూల దృక్పథంతో, అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్న తరుణంలో ఈ పేరు మార్పు తప్పనిసరి అయింది.

**ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు తక్షణమే రాష్ట్ర బీజేపీ స్పందించింది**

ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాల మేరకు రాష్ట్ర బీజేపీ తక్షణమే స్పందించింది. అప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నేతృత్వంలో జనాగ్రహ సభ పేరుతో పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచార చిత్రాలు సిద్ధమయ్యాయి. ఇప్పుడు వాటన్నింటినీ తొలగించి, కేవలం ప్రధాని మోదీ బహిరంగ సభ గా వ్యవహరించాలని నిర్ణయించారు. కార్యకర్తలు ఇప్పుడు పాత పోస్టర్లను సవరించే పనిలో నిమగ్నమయ్యారు.

**ఇదిలావుంటే, మే 10వ తేదీన ప్రధాని మోదీ షెడ్యూల్ అత్యంత బిజీ!**

ఇదిలావుంటే, మే 10వ తేదీన ప్రధాని మోదీ షెడ్యూల్ అత్యంత బిజీగా ఉండనుంది. మధ్యాహ్నం 3:00 గంటలకు ప్రధాని మోదీ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని తెలంగాణకు కేటాయించిన పలు ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. సాయంత్రం 4:00 గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు హాజరవుతారు. ఈ సభకు సంబంధించి రాష్ట్ర బీజేపీ నాయకత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. బీజేపీ శ్రేణులు ప్రధాని ప్రసంగంపై ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

**అధికారిక పర్యటనల విషయంలో పీఎంవో ఎంత నిశితంగా వ్యవహరిస్తుందో ఈ ఘటన స్పష్టం.**

వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే తెలంగాణపై భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సభ ద్వారా అటు అభివృద్ధిని, ఇటు రాజకీయ బలాన్ని చాటుకోవాలని బీజేపీ భావిస్తోంది. పరేడ్ గ్రౌండ్స్ సభకు భారీ ఎత్తున జనాన్ని సమీకరించి, దక్షిణ భారత్‌లో పార్టీ పట్టును నిరూపించుకోవాలని చూస్తోంది. పేరు మార్పు అనేది చిన్న పరిణామమే అయినప్పటికీ, అధికారిక పర్యటనల విషయంలో ప్రధానమంత్రి కార్యాలయం ఎంత నిశితంగా వ్యవహరిస్తుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ప్రధాని ప్రసంగంలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం చేసిన సాయంపై స్పష్టమైన ప్రకటనలు ఉండవచ్చని పార్టీ వర్గాలుఆశిస్తున్నాయి.

# ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

- ఈ అవకాశాన్ని వినియోగించుకోడానికి మే 1 నుంచి జులై 31 వరకు గడువు
- దరఖాస్తుదారులు ఈ రాయితీని పొందడానికి ఫీజు చెల్లింపు విధానం
- ఈ రాయితీ కేవలం అర్హమైన దరఖాస్తులకు మాత్రమే




తెలంగాణ పత్రిక ,మే 3

తెలంగాణలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీని ప్రకటిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

**ఈ అవకాశాన్ని వినియోగించుకోడానికి మే 1 నుంచి జులై 31 వరకు గడువు**

ఈ అవకాశాన్ని వినియోగించుకోవడానికి మే 1 నుంచి జులై 31 వరకు (మూడు నెలల పాటు) గడువు విధించింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులు ఈ మూడు నెలల కాలంలో ఫీజు చెల్లిస్తే, నిర్ణయించిన మొత్తంలో 25 శాతం తక్కువగా చెల్లిస్తే సరిపోతుంది. అయితే, ఇప్పటికే పూర్తి ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ పరిధిలో లక్షలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు 32,814 దరఖాస్తులను పరిష్కరించగా, మరో 2.02 లక్షల మంది దరఖాస్తుదారులకు ఫీజు వివరాలను అధికారులు పంపించారు. వీరంతా ఇప్పుడు రాయితీతో కూడిన ఫీజును చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవచ్చు. ఉదాహరణకు, ఒక ప్లాట్ క్రమబద్ధీకరణకు రూ. 1 లక్ష ఫీజు ఖరారు చేస్తే, ఈ రాయితీ కింద రూ. 75 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అంటే ఒక్కో దరఖాస్తుదారుడికి రూ. 25 వేల వరకు ఆదా అయ్యే అవకాశం ఉంది.

**దరఖాస్తుదారులు ఈ రాయితీని పొందడానికి ఫీజు చెల్లింపు విధానం**

దరఖాస్తుదారులు ఈ రాయితీని పొందడానికి కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అధికారిక వెబ్‌సైట్ 'lrs.telangana.gov.in"లోకి వెళ్లి సిటిజెన్ లాగిన్ ద్వారా తమ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వాలి. అక్కడ తమ దరఖాస్తు స్థితి (ఎ1/ఎ2/ఎ3) మరియు చెల్లించాల్సిన పెండింగ్ ఫీజు వివరాలు కనిపిస్తాయి. వెబ్‌సైట్‌లోనే నెట్ బ్యాంకింగ్ ద్వారా లేదా సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నేరుగా ఫీజు చెల్లించవచ్చు. ఫీజు చెల్లించే సమయంలో 25 శాతం రాయితీ ఆటోమేటిక్‌గా వర్తిస్తుంది. చెల్లింపు పూర్తయ్యాక అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

**ఈ రాయితీ కేవలం అర్హమైన దరఖాస్తులకు మాత్రమే**

ఈ రాయితీ కేవలం అర్హమైన దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుంది. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, శిఖం భూముల్లోని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అనర్హమైనవిగా ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఇప్పటికే ఇటువంటి సుమారు 1,830 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ఫీజు చెల్లింపులో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే హెచ్ఎండీఏ లేదా జీహెచ్ఎంసీ కార్యాలయాల్లోని ఎల్‌ఆర్‌ఎస్

# పిఎంజె జ్యూవెలరీ షాపు క్రైమ్ సీన్‌ను పరిశీలించిన ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి.



తెలంగాణ పత్రిక ,మే 3

భారీ దోపిడికి గురైన నగరంలోని జ్యోతినగర్ గల పిఎంజె నగల దుకాణాన్ని మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి సందర్శించారు. చోరీ ఘటన జరిగిన ప్రాంతంలో ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి పర్యటించారు. ముందుగా ఆయన క్రైమ్ సీన్‌ను (ఘటనా స్థలాన్ని) క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తు పురోగతిపై అధికారుల కు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఐజీపీ స్థానిక ఆసుపత్రిని సందర్శించి, ఈ ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచిస్తూ, వారికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పలువురు పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పట్టాల పై యువకుడు సూసైడ్..!

- రెండుగా విడిపోయిన శరీరం
- జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు



తెలంగాణ పత్రిక ,మే 3

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఆదివారం ఉదయం విషాద ఘటన చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పట్టాలపై హైదరాబాద్-ఢిల్లీ తెలంగాణ ఎక్స్ ప్రెస్ ప్లాట్ ఫామ్ పైకి వస్తుండగా,గుర్తుతెలియని యువకుడు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు అతడి పై నుంచి వెళ్లడంతో రెండు ముక్కలయ్యాడు.మృతుడు సుమారు 5.6 అడుగుల ఎత్తు, కుడి చేతి పై పల్లవి అని టాటూ ఉంది.ఆకుపచ్చ చెక్స్ షర్ట్,బ్లూ జీన్స్ ధరించాడు.జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఢిల్లీలో ఎగిసిపడ్డ అగ్నికీలలు.9 మంది సజీవదహనం

- దేశ రాజధానిలో ఆదివారం తెల్లవారు జామున ఘోర అగ్నిప్రమాదం
- మొత్తం 14 ఫైరింజన్లతో రెండుగంటలు తీవ్రంగా శ్రమించిన ఫైర్ సిబ్బంది
- అగ్నిప్రమాదానికి ఏసీ బ్లాస్టే కారణమా?ఘటనపై పోలీసుల దర్యాప్తు

తెలంగాణ పత్రిక ,మే 3

దేశరాజధాని ఢిల్లీలో ఆది వారం తెల్లవారు జామున ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది నాలుగు అంతస్తుల భవనంలో మంట లు ఎగిసిపడ్డాయి. ఢిల్లీలోని వివేక్ విహార్ ఏరియాలో ఎగిసిపడ్డ అగ్నికీలలకు 9 మంది సజీవదహనం అయ్యారు. ఈ భవనంలోని రెండో అంతస్తులో తెల్లవారు జామున 4 గంటలకు మంటలు చెలరేగినట్లు పోలీసులు పేర్కొన్నారు. మొత్తం 14 ఫైరింజన్లతో రెండు గంటల పాటు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. ఇక రెండో అంతస్తు నుంచి మూడు, నాలుగు అంతస్తులకు కూడా మంటలు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది పలువురిని ప్రాణాలతో కాపాడారు. 9 మంది సజీవదహనమైనట్లు పోలీసులు నిర్ధారించారు. గాయపడ్డ వారిని గురు తేజ్ బహదూర్ ఆస్పత్రికి తరలించారు.

అగ్నిప్రమాదానికి ఏసీ బ్లాస్టే కారణమా?ఘటనపై పోలీసుల దర్యాప్తు



అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కానీ భవనంలో నివాసం ఉంటున్న వారు ఏసీ పేలుడే అగ్నిప్రమాదానికి కారణమని పేర్కొంటున్నారు ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మీర్‌పేట్‌లో భయానక హిట్ అండ్ రన్!



- హైదరాబాద్ నగరంలో మరోసారి రోడ్డు భద్రత పై ప్రశ్నలు లేవనెత్తే ఘటన
- నగరంలో ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆందోళన
- కారు బానెట్‌పై 2 కి.మీ ఈడ్చుకెళ్లిన డ్రైవర్
- భయానక హిట్ అండ్ రన్ ఘటన
- సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కారు స్వాధీనం

తెలంగాణ పత్రిక ,మే 3

హైదరాబాద్ నగరంలో మరోసారి రోడ్డు భద్రతపై ప్రశ్నలు లేవనెత్తే ఘటన చోటుచేసుకుంది. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ భయానక హిట్ అండ్ రన్ ఘటన స్థానికుల ను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మే 1న ఎస్.కె. జిలానీ తన కుమారుడు ఫైసల్‌తో కలిసి బైక్ పై గాయత్రి నగర్ నుంచి ఎల్బీనగర్ వైపు ప్రయాణిస్తున్నారు. ఈ సమయంలో మీర్‌పేట్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు వారి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంతో కిందపడిపోయిన తండ్రి, కుమారుడు డ్రైవర్‌ను ప్రశ్నించగా, వాగ్వాదం చోటుచేసుకుంది.ఈ క్రమంలో డ్రైవర్ బాధితులపై దాడి చేసి అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. అతడిని అడ్డుకునేందుకు జిలానీ కారు ముందు నిలబడగా, డ్రైవర్ కనికరం లేకుండా వాహనాన్ని ముందుకు నడిపించాడు. ప్రాణాల కోసం జిలానీ కారు బానెట్‌ను పట్టుకోవడం





తో, డ్రైవర్ సుమారు 2 కిలోమీటర్ల మేర అతడిని ఈడ్చుకెళ్లాడు.బాధితుడు సహాయం కోసం అరుస్తున్నా, ఇతర వాహనదారులు హెచ్చరించినా డ్రైవర్ ఏమాత్రం ఆగకుండా బాలాపూర్ క్రాస్‌రోడ్స్ దాటి మందమల్లమ్మ జంక్షన్ వరకు దూసుకెళ్లాడు. ఈ దృశ్యాన్ని గమనించిన స్థానికులు ధైర్యంగా ముందుకు వచ్చి వాహనాన్ని అడ్డగట్టారు. దీంతో డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు.ఈ ఘటనలో ఫైసల్‌కు తీవ్ర గాయాలు కావడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. ప్రస్తుతం అతను ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జిలానీ కూడా తీవ్ర గాయాలతో బాధపడుతున్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కారు స్వాధీనం

సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పరారీలో ఉన్న డ్రైవర్ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం, హిట్ అండ్ రన్ కేసులు నమోదు చేశారు. నగరంలో ఇలాంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నేరాలకు కఠిన శిక్షలు విధించాలని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసే వారి లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# భగభగలాడుతున్న భాగ్యనగరం. అర్ధరాత్రి దాటినా తగ్గని ఎండ సెగలు



- హైదరాబాద్? అక్షరాలా అగ్ని గుండం.నగరమంతా హీట్ వేవ్ తీవ్రత
- వాతావరణ శాఖ 42.6 డిగ్రీలతో సీజన్?రికార్డు
- నగరం మొత్తం నిప్పుల కుంపటి అన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీలు పైగా!
- ప్రస్తుతానికి మాత్రం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ!
- రేపటితో ముగింపు? వర్ష సూచనలతో ఉపశమనం.
- వాతావరణశాఖ అంచనాలు

తెలంగాణ పత్రిక ,మే 3

హైదరాబాద్‌లో ఈ సీజన్ లోనే అత్యధికంగా 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది నగరమంతా హీట్‌వేవ్ తీవ్రత పెరిగింది. అయితే రేపటి తర్వాత వర్షాలతో ఉపశమనం లభించే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ నగరం అక్షరాలా అగ్నిగుండంలా మారింది. ఈ సీజన్‌లోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో 42డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు నమోదవగా, ముషీరాబాద్ విఠల్?వాడి ప్రాంతాల్లో 42.6డిగ్రీలు నమోదు కావడం గమనార్హం. అయితే ఇంకో రెండు రోజుల్లో ఉపశమనం కలుగుతుందని వాతావరణ శాఖ అంచనాలు.

నగరం మొత్తం నిప్పుల కుంపటి అన్ని ప్రాంతాల్లో 42డిగ్రీలు పైగా!

హైదరాబాద్‌లో ఎండలు అన్ని ప్రాంతాలను సమానంగా ప్రభావితం చేస్తున్నాయి. విఠల్‌వాడి, ముషీరాబాద్ ప్రాంతాల్లో 42.6 డిగ్రీలు నమోదు కాగా



చాంద్రాయణగుట్ట, యూసుఫ్‌గూడా ప్రాంతాల్లో 42.5 డిగ్రీలు నమోదయ్యాయి ఉప్పల్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, మలక్‌పేట్, ఫలక్‌నుమా, బేగంబజార్, శేరిలింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, బేగంపేట్ వంటి ప్రాంతాల్లో 42.4 డిగ్రీలు నమోదు కావడం నగరమంతా ఒకే విధమైన హీట్‌వేవ్ ప్రభావం ఉందని స్పష్టంగా చూపుతోంది. చార్మినార్, కుత్బుల్లాపూర్, మూసాపేట్ ప్రాంతాల్లో 42.3 డిగ్రీలు, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో 42.2 డిగ్రీలు ఆల్వాల్‌లో 42.1 డిగ్రీలు నమోదయ్యాయి.

రేపటితో ముగింపు? వర్ష సూచనలతో ఉపశమనం. వాతావరణశాఖ అంచనాలు


రేపటితో ముగింపు వర్ష సూచనలతో ఉపశమనం వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రేపటితో ఈ హీట్‌వేవ్ తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి తదుపరి రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతాయని, పిడుగులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు

ప్రస్తుతానికి మాత్రం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ!

ప్రస్తుతానికి మాత్రం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుంచి 4 వరకు బయటకు వెళ్లకూడదు. ఎక్కువగా నీళ్లు తాగాలి. తేలికపాటి దుస్తులు ధరించాలి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎండలు శిఖరానికి చేరుకున్నా ఇంకో 1-2 రోజుల్లో ఉపశమనం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పటివరకైతే జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.

# ఔటర్ రింగ్ రోడ్డులు యమలోకానికి దారులుగా మృత్యు ఘోష.

- మూడేళ్లలో ఔటర్ పై భారీగా పెరిగిన రోడ్డు ప్రమాదాలు!
- నగరాన్ని చుట్టుముట్టే 158కి.మీ ఔటర్ పై ప్రమాదాల సంఖ్య ఆందోళనకరం
- రాత్రి 3 నుంచి 6 గంటల మధ్య తెల్లవారు జామునే ఎక్కువ ప్రమాదాలు
- నిబంధనలకు విరుద్ధంగా ఇక 3,4 లేన్ లలో ఎక్కువగా లారీలు
- గడచిన ఐదు సంవత్సరాల్లో ఔటర్ పై భారీగా రోడ్డు ప్రమాదాలు



తెలంగాణ పత్రిక ,మే 3

ప్రభుత్వం జీరోయాక్సిడెంట్ యాక్షన్ ప్లాన్ ను అమలు పోలీసుల చర్యలు గడచిన ఐదు సంవత్సరాల్లో ఔటర్ పై భారీగా రోడ్డు ప్రమాదాలు ఔటర్ రింగ్ రోడ్డులు యమలోకానికి దారులుగా మారుతున్నాయి ఎన్ని అవగాహనలు కల్పించినా ఈ దారుల్లో ప్రమాదం ఆపడం అంత ఈజీ కానే కాదంటున్నారు అధికారులు కిలోమీటర్ల పొడవు, రైలింగ్ క్లియర్ గా లేన్ ల ఏర్పాటు, స్పీడ్ గన్ లు ఉన్నప్పటికీ వందల మంది ఈ ఔటర్ రింగ్ రోడ్డుల లో ప్రాణాలు కోల్పోతున్నారు

నగరాన్ని చుట్టుముట్టే 158 కి.మీ ఔటర్ పై ప్రమాదాల సంఖ్య ఆందోళనకరం

హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టే 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ పై ప్రమాదాల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతోంది. ప్రతి ఏడాది రోడ్డు సేఫ్టీ వారోత్సవాలు నిర్వహణ పేరుతో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలను మాత్రం అధికారులు నివారించలేకపోతున్నారు. రోడ్ సేఫ్టీ పై ప్రజలకు చాలా అవేర్నెస్ ఇచ్చినా ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నాయి.

గడచిన ఐదు సంవత్సరాల్లో ఔటర్ పై భారీగా రోడ్డు ప్రమాదాలు

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పై ప్రమాదాలు భారీగా చోటు చేసుకున్నాయి. గడచిన ఐదు సంవత్సరాల్లో హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పై ప్రమాదాలు భారీగా చోటు చేసుకున్నాయి. 2022లో 1,020గా ఉన్న ప్రమాదాలు 2024 నాటికి 1,582కి పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అదే సమయంలో మరణాలు కూడా 170 నుండి 250కు పైగా పెరిగాయి. తాజాగా 2026 మే 1న శంషాబాద్ సమీపంలో జరిగిన ఘోర ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

ఇక రాచకొండ పోలీసుల గణాంకాల ప్రకారం

2025లో ఔటర్ రింగ్ రోడ్ పై ప్రమాదాలు గణనీయం గా పెరిగాయి. 2024లో 52 కేసులు నమోదు కాగా, 2025లో అవి 76కి చేరాయి. మరణాలు 21 నుండి 37కి పెరిగాయి. గాయాల సంఖ్యలో కూడా భారీ పెరుగుదల కనిపించింది. 31 నుండి 80కి పెరగడం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో స్పష్టంగా చూపిస్తోంది. సైబరాబాద్ పరిధిలో కూడా 2025లో 34 మరణాలు నమోదయ్యాయి. మొత్తం మీద అన్ని కమిషనరేట్లలో కలిపి 70కు పైగా మరణాలు సంభవించినట్లు అంచనా.

రాత్రి 3 నుంచి 6 గంటల మధ్య తెల్లవారు జామునే ప్రమాదాలు ఎక్కువ

యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయ దర్శనం ముగించుకొని హైదరాబాద్ వస్తున్న కుటుంబం వాహనం శంషాబాద్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. కారు ఢీకొట్టడం తో కారు పూర్తిగా ధ్వంసమై ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ అలసట కారణంగా నిద్రపోవడం ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు ఔటర్ రింగ్ రోడ్ పై ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అతివేగం, లేన్ డిసిప్లిన్ లోపం, అర్ధరాత్రి సమయం లో రాష్ డ్రైవింగ్, రోడ్డు మీద ఇష్టం వచ్చినట్టు లారీలు నిలిపివేయడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి అంశాలు గుర్తించబడ్డాయి. ముఖ్యంగా రాత్రి 3 నుంచి 6 గంటలమధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగు తున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి ఔటర్ పై ఉన్న నాలుగు లేన్స్ లో 1,2 లేన్ లలో కార్లు వెళ్తాయి. ఈ లేన్ లలో వెళ్లే వాహనాల స్పీడ్ 120 నుండి 140 మధ్యలో ఉంటుంది.

నిబంధనలకు విరుద్ధంగా ఇక 3,4 లేన్ లలో ఎక్కువ గా లారీలు

ఇక 3,4 లేన్ లలో ఎక్కువగా లారీలు వెళుతుంటాయి. ఇవి 80 నుండి 100 స్పీడ్ లో ఉంటాయి. కార్లు 140 స్పీడ్ తో లేన్ లు మారినప్పుడు ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలను పార్క్ చేయడం అనేది నిబంధనలకు విరుద్ధం. అవుటర్ ఎమర్జెన్సీ లేన్ ఉన్నప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో పార్క్ చేయవలసి వస్తే ఖచ్చితంగా పార్కింగ్ లైట్లు ఆన్ చేయాలి. కానీ చాలామంది లారీ డ్రైవర్లు ఈ నిబంధన ను పట్టించుకోకుండానే ఇష్టానుసారంగా ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాలను పార్క్ చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్ పై ఎక్కువ ప్రమాదాలు ఆగి ఉన్న వాహనం ను ఢీ కొట్టడం తోనే అవుతున్నాయి.

ప్రభుత్వం జీరోయాక్సిడెంట్ యాక్షన్ ప్లాన్ అమలులో పోలీసుల చర్యలు

ఈ పరిస్థితిని దృష్టి లో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం జీరో యాక్సిడెంట్ యాక్షన్ ప్లాన్ ను అమలు చేయడానికి సిద్ధమైంది. అండర్‌పాస్‌ల వద్ద సీసీటీవీ నిఘా, రూల్స్ ఉల్లంఘించే వారిపై ఆటోమేటిక్ జరిమానాలు, వేగ నియంత్రణ, రాత్రి పూట పెట్రోలింగ్ బలోపేతం వంటి చర్యలు తీసు కోనున్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వారి పై కఠిన చర్యలు తీసు కోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేసే చర్యలు కూడా ప్రతిపాదించారు.

గత ఐదేళ్లలో 375 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు

గత ఐదేళ్లలో ఔటర్ రింగ్ రోడ్ పై 375 మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కఠిన చర్యలు, అవగాహన కార్యక్రమాలు, రోడ్డు నిర్మాణ లోపాల సవరణ లేకపోతే ఔటర్ రింగ్ రోడ్ పై మరిన్ని ప్రాణాలను బలి తీసుకునే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# తేమ శాతం వచ్చిన వరిని వెంటనే లిఫ్టింగ్ చేయాలి కలెక్టర్ హైమావతి ఆదేశాలు

తెలంగాణ పత్రిక ,మే 3

సిద్దిపేట జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. తేమ శాతం వచ్చి, తాలు తీసిన వరి ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసి మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామం, మద్దూరు మండలం సలాక్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. రైతులు ధాన్యం అమ్మకానికి తీసుకువచ్చిన వెంటనే కొనుగోలు ప్రక్రియ పూర్తవ్వాలని, ఎక్కడా నిల్వలు పేరుకుపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే లారీలలో లేదా ట్రాక్టర్లలో నింపి మిల్లులకు తరలించాలని తెలిపారు. మిల్లుల వద్ద కూడా జాప్యం లేకుండా ఒకే కొనుగోలు కేంద్రానికి రెండు లేదా మూడు మిల్లులను కేటాయించాలని సివిల్ సప్లై అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, కొనుగోలు కేంద్రాల్లో ప్యాడి క్లీనర్లు, వేయింగ్ మిషన్లు వంటి పరికరాలు సక్రమంగా పనిచేయాలని, ఏదైనా లోపం ఉంటే వెంటనే



మరమ్మతులు చేయాలని సూచించారు. అవసరమైన అన్ని సదుపాయాలు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

# ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని విక్రయించుకోవాలి

-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి



తెలంగాణ పత్రిక ,మే 3

రైతుల పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట పిఎసిఎస్ పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులకు సూచించారు. అలాగే మధ్యవర్తులను నమ్మి మోసపోవుటకంటే కేంద్రాలలోనే రైతులు నేరుగా విక్రయించుకొని 48గంటల్లో తమ డబ్బులను ప్రభుత్వం రైతుల ఖాతాలో జామ చేస్తున్నట్టు ఆమె వెల్లడించారు. ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాల్సిందిగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా,కొల్చారం మండలం యువత విభాగం అధ్యక్షుడు తుంకులపల్లి సంతోష్ రావు,సీనియర్ నాయకుడు రమేష్ కుమార్, రంగంపేట సీఈవో నవీన్ ,తుక్కాపూర్ గ్రామసర్పంచ్ ఆంజనేయులు ,ఉపసర్పంచ్ ఆరే రవీందర్, ధనరాజ్, తుక్కాపూర్ గ్రామ వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్

తెలంగాణ పత్రిక ,మే 3

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ఆదివారం జరిగిన పలు శుభకార్యాలకు మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన దిగజర్ల బిక్షపతి మహాలక్ష్మి దంపతుల కుమారుడు గణేష్,హరిచందన వివాహము చిన్నెమిల తిరుమల ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఇట్టి వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్,మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రామడుగు అచ్యుత్ రావు,లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మాజీ జడ్పిటిసి తేజావత్ శారద రవీందర్,మాజీ సర్పంచ్ దిగజర్ల శ్వేత ముకేష్ ,దిగజర్ల పేపర్ శ్రీను, ఎడెల్లి పరశురాములు ,వీరబాబు, యుగేందర్,వాంకుడోత్ అశోక్,మహేష్,అంజి, వెంకన్న, గవాస్కర్, అయూబ్ పాషా ,నరేష్,కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా మరిపెడ మండలం ఎల్లారిగూడెం గ్రామానికి చెందిన బానోతు వీరన్న కుమార్తె మౌనిక-జీవన్ వివాహానికి,తాళ్ల ఊకల్ బాల్యతండాకు చెందిన గుగులోత్ మోహిని కుమార్తె వివాహానికి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్,మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు,సీనియర్ నాయకులు రామడుగు అచ్యుత్ రావు



హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట ఎల్లారిగూడెం గ్రామ సర్పంచ్ శాంతి మల్సూర్,ఆలూ,మాలు, ఉగంపల్లి గ్రామ సర్పంచ్ అయూబ్ పాషా,కుటుంబ సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ వైఖరి నివసిస్తూ ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఆకారపు అరుణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

-స్టేడియం సాక్షిగా గర్జిస్తున్న నినాదం.!



తెలంగాణ పత్రిక ,మే 3

ఉప్పల్ స్టేడియంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఎస్ఆర్ హెచ్ వైస్ కేకేఆర్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడుతున్న తీరును నిరసిస్తూ "పీఎం ఈస్ కంప్రమైజ్డ్ "అనే సందేశాన్ని చాటిచెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రష్యా దగ్గర క్రూడ్ ఆయిల్ కొనుక్కోవడానికి ట్రంప్ పర్మిషన్ ఇవ్వడం ఏమిటి. అసలు మన దేశం ఎవరి దగ్గర కొనాలో నిర్ణయించడానికి ట్రంప్ ఎవరు.? దీనిపై మోదీ గట్టి కౌంటర్ ఇవ్వలేకపోవడం,మన దేశ గౌరవాన్ని ట్రంప్ చేతుల్లో తాకట్టు పెట్టడమే అని అన్నారు. దేశాభిమానం కంటే పరాయి దేశాధినేతల మెప్పు ముఖ్యం అయిపోయిందా. దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న ఈవైఖరిని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దేశ గౌరవం తాకట్టు పెట్టిన చోట నాయకత్వం ఓడిపోయినట్లేనని అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

# కార్మిక హక్కులను అణచివేస్తున్న ప్రభుత్వాలు

-సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దుండి వీరన్న

తెలంగాణ పత్రిక ,మే 3

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాల రాస్తున్నాయని,వాటిని పోరాడి సాధించుకోవాలని సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు దండి వీరన్న అన్నారు. ఆదివారం మరిపెడ మండలంలోని ఉల్లెపల్లిలో భవననిర్మాణం కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ .కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తర్వాత కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసిందని విమర్శించారు. 29కార్మిక చట్టాలను రద్దుచేసి4లేబర్ కోడ్స్ తీసుకురావడం వలన కోట్లాది మంది కార్మికులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాలను కార్మికులు ఐక్యంగా ఉండి పోరాడి సాధించుకోవాలన్నారు. అంతేగాక భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల నిధిని ఇతర సంస్థలకు దారి మళ్లించి కార్మికుల శ్రమను ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. సిఐటియు పోరాటాల వల్ల అనేక రకాలుగా కార్మిక సౌకర్యాల కోసం రావాల్సిన హక్కులను సాధించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొండ ఉప్పలయ్య,ఉపాధ్యక్షులు జినక సైదులు,సీనియర్ నాయకులు నవిల నెంబర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ



ఎన్నిక మండలంలోని ఉల్లెపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు .గ్రామ అధ్యక్షులుగా సంద్ర బిక్షం, కార్యదర్శిగా ఎర్ల నారాయణ, కోశాధికారిగా ఉల్లోజు వేమన,ఉపాధ్యక్షులుగా నవిలే రాంబాబు తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

# గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మతల్లికి బోనాలు



తెలంగాణ పత్రిక ,మే 3

మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీరేణుకఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో భాగంగా మొదటి రోజు గౌడ కులస్తుల ఆధ్వర్యంలో పోచమ్మతల్లికి బైండ్ల రాజుల నృత్య ప్రదర్శనల మధ్య ఊరేగింపుగా తరలి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో బోనాలను సమర్పించారు. అమ్మవారి అనుగ్రహం గ్రామ ప్రజలపై ఉండాలన్నారు. అలాగే మరసటి రోజు ఎల్లమ్మతల్లికి బోనాలు,ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని కళ్యాణ మహోత్సవాన్ని గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట గౌడ కులస్తులు ,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

-ధాన్యం,మక్కల కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం
-వారం రోజుల్లోపు ధాన్యం,మక్కలు కొనుగోలు చేసి రైతు సమస్యలు పరిష్కరించాలి
-మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్
-మరిపెడ ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

తెలంగాణ పత్రిక ,మే 3

ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ విమర్శించారు. ఆదివారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు,బిఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రంలోని సమస్యలను ,రైతుల కష్టాలను తెలుసుకున్నారు. అనంతర మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ..ధాన్యం కొనుగోలు, తరలింపులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు నెల రోజులుగా రైతులు ధాన్యం తీసుకువస్తున్నప్పటికీ ఇప్పటివరకు కొను గోళ్లు జరగలేదని ఆరోపించారు. నెల రోజులుగా వడ్లు కొనుగోలు చేయకపోవడం, రవాణా సదుపాయాలు లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు సుమారు 20వేల బస్తాల



ధాన్యం నిల్వలో ఉన్నప్పటికీ, కేవలం1800 బస్తాలకు మాత్రమే కాంటాలు పెట్టినట్లు తెలిపారు. వాటిని కూడా ఇప్పటివరకు తరలించలేదని విమర్శించారు. నెల రోజులుగా కాంటాలు వేయకపోవడం, బస్తాల కొరత, తూర్పాల యంత్రాలు పనిచేయకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు .ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు పంపే విషయంలో ప్రభుత్వానికి స్పష్టమైన ప్రణాళిక లేదని విమర్శించారు. ఏ మిల్లర్‌కు పంపాలన్నదీ, రవాణా ఎలా చేయాలన్నదీ ప్రభుత్వానికి ప్రణాళిక లేదని ఆరోపించారు. వరి, పత్తి,మక్కలు, వేరుశెనగ తదితర పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పినా,అది పూర్తిగా అమలు కాలేదన్నారు. తూతూ మంత్రంగా వానాకాలం ధాన్యానికి బోనస్ వేసి యాసంగికి ఎగ్గొట్టిందన్నారు. ఎకరాకు రూ.15వేల రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు కేవలం ఒక పంటకే పరిమిత మయ్యారని చెప్పారు. కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ,బస్తాలు లేకపోవడం,రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల మక్కలు కేంద్రంలో రాశులుగా నిల్వ ఉన్నాయని విమర్శించారు. రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహిళలకు 2500లు, విద్యార్థులకు డిపాజిట్లు, పెన్షన్లు వంటి పలు హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రామడుగు అచ్యుత రావు,నాయకులు గుడిపుడి శ్రీనివాస రావు,తేజావత్ రవీందర్, ఉప్పల నాగేశ్వరరావు,గంట్ల సుధాకర్ రెడ్డి,జాటోతు బాలాజీ, గంట్ల మహిపాల్ రెడ్డి,గంట్ల నాగమణి శ్రీనివాస్ రెడ్డి,బోడ భాస్కర్, సత్యవతి యుగంధర్, అజ్మీర హరినాయక్,కాలు నాయక్, చిర్రబోయిన ప్రభాకర్,నారెడ్డి సుదర్శన్ రెడ్డి, అయూబ్ పాషా, భాషిపంగు పరశురాములు,బానోత్ శ్రీను,కొమ్ము నరేష్,బాదావత్ రవి,వస్రం,మంగపతి రావు,వల్లూరి చెన్నారెడ్డి, లతీఫ్,మక్సూద్, హుస్సేన్, డాక్టర్ మంద వెంకన్న,ఊరుకొండ శ్రీనివాస్,రాంపల్లి రవి,గంధసిరి కృష్ణ, జినక ఇద్దయ్య,మాచర్ల భద్రయ్య, బోడ రెడ్డి,రవీందర్,పట్టాభి,వీరబాబు,భూక్యా శంకర్, కొడికంటి సతీష్,ఎడెల్లి సైదులు, లూనావత్ వెంకన్న, మోర వెంకన్న, నర్సయ్య, చిరంజీవి, లకావాత్ రవి,బానోత్ రాజు,ఐనాల పరశురాములు, బానోత్ వెంకన్న,పాండు నాయక్,ఎడెల్లి రవి,సక్రం, అంబేద్కర్ శ్రీను,నవిలే వెంకన్న,కయూమ్,బిఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ గోల్కొండ వెంకన్న,పట్ల వంశీ, సంతోష్, నాయకులు, కార్యకర్తలు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి మనసు వెన్న.. స్పందన మెరుపు తీగ




- ఎడమ కాలు లేని ఓ మహిళకు 'పొంగులేటి' అభయం..
- 120 నిమిషాల్లోనే అందిన వీల్ ఛైర్
- ప్రజా దర్బార్‌లో బాధితురాలికి అండగా నిలిచిన మంత్రి.. క్షేత్రస్థాయిలో సత్వర పరిష్కారం

తెలంగాణ పత్రిక ,మే 3

కూసుమంచి : అధికారం అంటే ఆజ్ఞాపించడం కాదు.. ఆపదలో ఉన్నవారి కన్నీరు తుడవడమేనని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరోసారి నిరూపించారు. సామాన్యుల సమస్యలను నేరుగా వినేందుకు ఆయన నిర్వహిస్తున్న 'ప్రజా దర్బార్' ఒక నిరుపేద మహిళ జీవితంలో కొత్త వెలుగులు నింపింది. ఎడమ కాలు లేక, కనీసం అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో ఉన్న ఓ బాధితురాలి ఆవేదన చూసి చలించిన మంత్రి.. కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఆమెకు ఊతమిచ్చారు.

**కదిలించిన దీనగాథ..**

మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన షేక్ షకీనా అనే మహిళకు ఎడమ కాలు లేదు. నడవలేక, తన పనులు తాను చేసుకోలేక నిత్యం నరకయాతన పడుతున్న ఆమె, ఆశగా ప్రజా దర్బార్‌కు చేరుకుంది. తన దీనస్థితిని మంత్రి పొంగులేటికి వివరిస్తూ.. "అయ్యా.. నా కాలు లేక బతుకు భారమైంది.. ఒక చక్రాల కుర్చీ ఉంటే ఎవరి మీద ఆధారపడకుండా నా పనులు నేను చేసుకుంటాను" అని వేడుకుంది. ఆ మహిళ ఆర్తిని చూసిన మంత్రి మనసు వెన్నలా కరిగిపోయింది. "అమ్మా.. దిగులు పడకు, నేనున్నాను" అని భరోసా ఇచ్చారు.

**మెరుపు వేగంతో భరోసా..**

మంత్రి ఆదేశం మెరుపు తీగలా పనిచేసింది. విన్నపం అందిన కేవలం 120 నిమిషాల్లోనే అధికారులు కొత్త వీల్ ఛైర్‌ను సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో మంత్రి పొంగులేటి స్వయంగా ఆమె పక్కన నిలబడి, ఆత్మీయంగా పలకరిస్తూ వీల్ ఛైర్‌ను అందజేశారు. సమస్య చెప్పిన కొద్దిసేపటికే పరిష్కారం లభించడంతో ఆ మహిళ కళ్లలో మెరిసిన ఆనంద బాష్పాలే పొంగులేటి ప్రజా పాలనకు నిదర్శనంగా నిలిచాయి.

**సర్వత్రా హర్షం..**

తక్షణమే స్పందించి తనకు అండగా నిలిచిన మంత్రికి షకీనా మనసారా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా ప్రజా దర్బార్‌లు నిర్వహిస్తూ, ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్తున్న మంత్రి పొంగులేటి తీరుపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమవుతోంది.

# అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు




- త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇళ్ల మంజూరు..
- కూసుమంచి ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా..

తెలంగాణ పత్రిక ,మే 3

కూసుమంచి : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సాదా బైనామా, నిషేధిత జాబితా , భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా సంక్షేమ పథకాలను మరింత వేగంగా ప్రజల్లోకి తీసుకెళు తున్నామని వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేశారు. ప్రజా దర్బార్లలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసమే దరఖాస్తులు వస్తున్నాయని, గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని, మే నెలాఖరు నాటికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 25 లక్షల మందికి రుణమాఫీ చేశామని, రైతు భరోసాను ఎకరానికి 12 వేలకు పెంచడంతో పాటు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తున్నామని గుర్తుచేశారు. మే 5 నుంచి 7 వరకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతం

- ఒక్క రోజులోనే రూ.44 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ
- ఇప్పటివరకు రూ.115 కోట్లు రైతులకు చెల్లింపు
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



తెలంగాణ పత్రిక ,మే 3:

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, ప్రతి కొనుగోలు కేంద్రంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.ఒక్క రోజులోనే రూ.44 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేయబడినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మొత్తం రూ.115 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి వెంటనే కొనుగోలు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీలు,తూకం యంత్రాలు,రవాణా సౌకర్యాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.అదేవిధంగా రైతులకు తాగునీరు, నీడ, విశ్రాంతి వంటి మౌలిక సదుపాయాలను కల్పించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం విక్రయంలో మధ్యవర్తుల పాత్ర లేకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకురావాలని సూచించారు.ఎక్కడైనా అవకతవకలు గమనించినట్లయితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ధాన్యం కొనుగోళ్ల పై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ ,ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు న్యాయమైన ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న ఐదు లారీలు మరియు ఒక జేసీబీ ను సీజ్ చేసిన జిల్లా పోలీసులు..

తెలంగాణ పత్రిక ,మే 3

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఆదివారం ఉదయం ఐదు లారీలు,ఒక జేసిబీ ను జిల్లా పోలీసులు సీజ్ చేయడం జరిగింది.పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు లారీలను,దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక లారీ,బూర్గంపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు లారీలు మరియు ఒక జెసీబీను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సంబంధిత శాఖాధికారులతో సమన్వయం పాటిస్తూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతు ందని తెలిపారు. పట్టుబడిన ఇసుక అక్రమ రవాణాదారుల పై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.ు

## కామారెడ్డిలో భారీ అగ్నిప్రమాదం...

- 12 షాపుల దగ్ధం భారీగా ఆస్తినష్టం



తెలంగాణ పత్రిక ,మే 3:

తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి పట్టణం పాత బస్టాండ్ వద్ద భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 12 షాపులు దగ్ధమయ్యాయి. పాత బస్టాండ్ మూలమలుపు వద్ద ఉన్న సుమారు 12 షాపులు అగ్నికి ఆహుతయ్యాయి. 12 షాపులకు సంబంధించి రూ.50 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. ప్రమాదవశత్తు అగ్ని ప్రమాదం జరిగిందా లేక ఎవరైనా కావాలనే నిప్పంటించారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే,ప్రమాదానికి గల కారణాలు ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందా లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. దుకాణాలు దగ్ధం కావడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## నీట్-యూజీ 2026 పరీక్ష కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్...




తెలంగాణ పత్రిక ,మే 3

వైద్య, విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో నిర్వహించే నీట్-యూజీ 2026 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పటిష్ట పోలీస్ బందోబస్త్, భద్రతను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించి, పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నం 12గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ (బిఎన్ ఎస్ ఎస్ ) సెక్షన్ 163 అంక్షాలు అమలులో ఉంటుందన్నారు. శాంతి నగర్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం సందర్శించిన పోలీస్ కమిషనర్ టౌన్ ఏసీపీ రమణమూర్తి కి పలు సూచనలు చేశారు.

## తల్లి ఆశీర్వాదాలు తీసుకున్న డీజీపీ సీవీ ఆనంద్



తెలంగాణ పత్రిక ,మే 3

తెలంగాణ రాష్ట్ర డీజీపీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ ఆదివారం తన తల్లిని కలిసి ఆమె ఆశీర్వాదాలు పొందారు.నవంబర్ నుంచి జనవరి వరకు తీవ్ర అనారోగ్యంతో బాధపడిన తల్లి, ప్రస్తుతం కోలుకుంటున్నారని, అయితే మంచానికే పరిమితమై ఉన్నారని తెలిపారు.తన కుమారుడు డీజీపీగా బాధ్యతలు చేపట్టడం చూడాలన్న తల్లి కోరికే ఆమెను కోలుకునేలా చేసిందని ఆయన అభిప్రాయపడ్డారు.కుమారుడి ఉన్నత పదవిని చూసి తల్లి ఆనందించగా,తాను కూడా అదే స్థాయిలో సంతోషం వ్యక్తం చేసినట్లు డీజీపీ పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

-కలెక్టర్ చిత్రా మిశ్రా



తెలంగాణ పత్రిక ,మే 3

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ పరీక్ష (నీట్) ఆదివారం కరీంనగర్ లో ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ లోని మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ఆర్ కళాశాల, కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా కరీంనగర్లో నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్లతో వసతులు అభ్యర్థుల హాజరు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కరీంనగర్లో ఏడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని, మొత్తం 2928 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారనీ. అందులో 2865 మంది హాజరు కాగా 63 మంది గైర్హాజరయ్యారనీ తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాలలో 725 మంది అభ్యర్థులు, ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కాలేజీలో 704 మంది కేంద్రీయ విద్యాలయంలో 376 మంది, మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో 305, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో 283 మంది, టీజీఎస్ డబ్ల్యు ఆర్ చింతకుంట బాలికల కళాశాలలో 239 మంది, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో 233 మంది, అభ్యర్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. అభ్యర్థులను సునిశిత పరిశీలన తర్వాతనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పోలీసులు పకడ్బందీగా తనిఖీలు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్ష జరిగినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న మొత్తం అభ్యర్థుల్లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై పరీక్ష రాశారనీ. హాజరు శాతం సంతృప్తికరంగా నమోదయిందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నియమించిన నోడల్ తహసీల్దార్లు పరీక్ష నిర్వహణను సమర్థవంతంగా పర్యవేక్షించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారనీ తెలిపారు. అదేవిధంగా విద్యాశాఖ, ట్రాఫిక్, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్ష సజావుగా జరిగేలా సహకరించారనీ కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరు నమోదు 100 శాతం పూర్తైందన్నారు. భౌతిక హాజరు బయోమెట్రిక్ హాజరు వివరాలు పూర్తిగా సరిపోలాయనీ, మొత్తం ప్రక్రియను ఎన్‌టీఏ బృందంతో సమన్వయం చేస్తూ జిల్లా యంత్రాంగం పర్యవేక్షణలో పరీక్ష విజయవంతంగా పూర్తయ్యిందనీ పేర్కొన్నారు.

## పాయల శంకర్ మోసపూరిత ప్రకటనలతో రైతులను తప్పుదోవ పట్టించుకోవడం మానుకోవాలి

-మాజీ మంత్రి జోగు రామన్న

తెలంగాణ పత్రిక ,మే 3



జొన్నలు శనగలు కొనుగోళ్ల విషయంలో రైతులను మభ్య పెట్టేందుకు ఎమ్మెల్యే పాయల శంకర్ కుంటి సాకులు చెబుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని మాజీ మంత్రి జోగురామన్న తీవ్రంగా విమర్శించారు.గత తెలంగాణ ప్రభుత్వంలో రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని నేడు కొత్తగా సమస్యలు చూపించడం ఆచార్యకరమని పేర్కొన్నారు. అప్పట్లో పనిచేసిన అధికారులు ఇప్పటికీ విధుల్లో ఉన్నారని విధానాలపై సరైన అవగాహనతో మాట్లాడాలని సూచించారు. మోసపూరిత ప్రకటనలతో రైతులను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హెచ్చరిస్తూ రైతు ప్రయోజనాల కోసం నిజాయితీగా పని చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు.

# పత్రిక విలేకరిపై శ్రీగీతం కళాశాల యాజమాన్యం గుండాలతో దాడీ హేయమైన చర్య

తెలంగాణ పత్రిక ,మే 3

మనం దినపత్రిక లక్ష్మీనారాయణ అనంతపురంలోని శ్రీగీతం జూనియర్ కళాశాలలో జరుగుతున్న అక్రమాలపై కథనాలు రాసినందుకు ఆ యాజమాన్యం జీర్ణించుకోలేక వారి గుండాలతో శనివారం అనంతపురంలోని లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి విచక్షణ రహితంగా దాడి చేసి,కుటుంభం సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి లక్ష్మీనారాయణ చేత కాళ్లు మొక్కించుకోవడం సంఘటన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సూర్య రేఖ దినపత్రిక పాత్రికేయుడు నారాయణ దాడిని తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ లాంటి ఘటనలు ప్రజాస్వామ్య మనుగడకు మూలాధారమైన పత్రికా వ్యవస్థపై దాడి సమంజసం కాదని అన్నారు.వ్యతిరేక వార్తలు రాసినప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా దానికి వివరణ ఇవ్వాలని,లేదా ప్రకటన ద్వారా ఖండించాలి తప్ప,భౌతిక దాడులు సరైన మార్గం కాదని ఆగ్రహం వ్యక్తం చేసారు.వార్తా కథనం తప్పు అని మీరు భావిస్తే వ్రాసిన పాత్రికేయుడు పైన,ఆ పత్రిక యాజమాన్యంపై మీరు లీగల్ గా చర్యలు తీసుకోవచ్చు అన్నారు. అలా కాకుండా బాడీగార్డ్స్ ను వేటేసుకొని మీరు ఇంటికి వెళ్లి కుటుంబాన్ని విచ్చలవిడిగా కొట్టి భయభ్రాంతులకు గురి చేయడం, ముమ్మాటికి నేరమన్నారు. ఒక విలేఖరిని చేతగాని వాడని ఇలా హింసించి కొట్టడం చాలా బాధాకరమని దుయ్యబట్టారు .సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలికి తీసి ప్రజల ముందు ఉంచినందుకు ఇలాంటి చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటివని వన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు బాధిత



పాత్రికేయులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలువాలని డిమాండ్ చేశారు.దాడికి పాల్పడిన వారిపై నాన్ బేలెబుల్ కేసులు నమోదు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నీట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్

తెలంగాణ పత్రిక ,మే 3

పట్టణంలోని డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత పరిశీలించారు. నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని గదుల అమరిక, సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్ష నిర్వహణలో పారదర్శకత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ఎటువంటి లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి కేంద్రానికి చేరుకునేలా మరియు వారికి కావలిసిన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. అదేవిధంగా, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, వైద్యాధికారి సుజాత, కాలేజీ ప్రిన్సిపాల్ అరిగెల అశోక్, జగిత్యాల అర్బన్



తహసీల్దార్ రామ్ మోహన్, సంబంధిత అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం

-ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే

తెలంగాణ పత్రిక ,మే 3

శ్రీభ్రమరాంబమల స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కొల్చారం మండలం పైతర గ్రామంలో నిర్వహించిన శ్రీమల్లికార్జునస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.మెదక్ జిల్లా కొల్చారం మండలం పైతర గ్రామంలో గ్రామ వాస్తవ్యులు ఏల్లుగారి రామకృష్ణారెడ్డి వారి సతీమణి,వారి కుటుంబ సభ్యులచే పైతర గ్రామంలో గ్రామ ప్రజల సౌకర్యార్థం నూతన కళ్యాణ మండపాన్ని నిర్మించి ప్రారంభించారు.ఆదివారం మండపంలో స్వామి వారి కళ్యాణం సత్యనారాయణ వ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి,నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మాజీ డిజిపి



మహేందర్ రెడ్డి,అదనపు కలెక్టర్ నగేష్,కొల్చారం తాహసిల్దార్ శ్రీనివాస్ చారి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు యాబన్నగారి రవితేజరెడ్డి, కొల్చారం మండల యువత విభాగం అధ్యక్షుడు తుంకలపల్లి సంతోష్




రావు,సీనియర్ నాయకుడు అరిగే రమేష్ కుమార్,అప్పాజీపల్లి ధనరాజ్ ,పైతర మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రెడ్డి, పైతర గ్రామ పెద్దలు,యువ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవి తండ్రి దివంగత బొడ్డు రాజలింగం దశదిన కర్మ

-హాజరైన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

తెలంగాణ పత్రిక ,మే 3


మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవి తండ్రి దివంగత బొడ్డు రాజలింగం గత పది రోజులు క్రితం అనారోగ్య కారణాల దృశ్య మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే.ఆదివారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవి కుటుంబంలో బొడ్డు రాజలింగం దశదిన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి, పలువురు ప్రముఖులు,మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు బంధుమిత్రులు, వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు,హాజరై ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.ఈ సందర్భంగా రవి కుటుంబ సభ్యులకు హాజరైన వారందరూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేయడం జరిగింది.దశదిన కార్యక్రమానికి కార్యక్రమానికి హాజరైన వారిలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వై.రమణగౌడ్,జిల్లా గ్రంధాల సంస్థ మాజీ చైర్మన్ దొంతి చంద్రగౌడ్,జెడ్పి మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్,రాష్ట్ర రవాణాశాఖ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు,శివ్వంపేట ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు ఇసుగారి మల్లేష్,ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు నటరాజ్ గౌడ్,సర్పంచులు బ్యాగరి



నరసయ్య,ఉప సర్పంచ్ కొత్తపేట వెంకటేశంగౌడ్,టిక్క దేవమ్మ గూడెం సర్పంచ్ లకావత్ తేజస్విని-రాజేందర్ నాయక్,పిఎసిఎస్ డైరెక్టర్ కొత్తపేట యాదగౌడ్, శ్రీశైలం యాదవ్,జర్నలిస్టులు గుండ్లపల్లి రవి, శ్రీనివాస్ రెడ్డి,కొండ సంపత్ కుమార్ తదితరులు తదితరులు ఉన్నారు.

# బిజినెస్

## బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐ.. నోటి ఫై చేసిన కేంద్రం




తెలంగాణ పత్రిక ,మే 3

బీమా రంగంలో ఆటోమేటిక్ రూట్‌లో 100 శాతం ఎఫ్‌డీఐకి (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) అనుమతిస్తూ చట్టానికి చేసిన మార్పులను కేంద్రం తాజాగా నోటిఫై చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే, ఎల్‌ఐసీలో మాత్రం ఈ తరహా పెట్టుబడులు 20 శాతానికి పరిమితమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో, విదేశీ పెట్టుబడి దారులు భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నేరుగా పెట్టుబడి పెట్టేందుకు మార్గం సుగమమైంది. అయితే, ఈ పెట్టుబడులకు ఐఆర్‌డీఏ అనుమతులు అవసరమని కూడా ఆర్థిక శాఖ తన ప్రకటనలో తెలిపింది. బీమా కంపెనీల్లో ఆటోమేటిక్ రూట్‌లో విదేశీ పెట్టుబడులను 74 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ పార్లమెంటు గతేడాది కొత్త బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. సబ్కా బీమా సబ్కీ రక్షా బిల్లు పేరిట ఇన్సూరెన్స్ చట్టంలో సవరణలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో ఇన్సూరెన్స్ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయని అన్నారు. దేశ నలుమూలలకూ ఇన్సూరెన్స్ సేవలు విస్తరిస్తాయని చెప్పారు. అప్పటికే విదేశీ పెట్టుబడులకు మార్గాలు ఉన్నప్పటికీ చేయాల్సింది ఇంకా ఎంతో ఉందని కూడా ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. వివిధ కారణాలతో భారత్‌లో భాగస్వామ్య కంపెనీలు లభించక మిన్నకుండిపోయిన విదేశీ కంపెనీలు దేశంలోకి వస్తాయని చెప్పారు. ఇది అంతిమంగా వినియోగ దారులకు లాభం చేకూరుస్తుందని మంత్రి అన్నారు. ఈ రంగంలో పోటీ పెరిగి యూజర్లకు ఇన్సూరెన్స్ ప్రీమియంల భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలు జీఎస్‌టీ చెల్లించాలా

తెలంగాణ పత్రిక ,మే 3




ఇటీవలి కాలంలో గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించే వారు జీఎస్‌టీకి సంబంధించి ఆందోళన చెందటం చూస్తున్నాం. ముఖ్యంగా వెల్ఫేర్ అసోసియేషన్స్ తాము జీఎస్‌టీ చెల్లించాల్సి రావటం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అసలు వెల్ఫేర్ అసోసియేషన్ జీఎస్‌టీ కట్టాల్సిన అవసరం ఉందా? ఆ వివరాలు మీ కోసం.. ఒకప్పుడు అపార్ట్‌మెంట్ అంటే నాలుగైదు అంతస్తులకు మాత్రమే పరిమితమై ఉండేవి. వీటిలో కనీస అవసరాలు మాత్రమే ఉండేవి. క్రమేపి ప్రజల జీవనశైలి మారటం, అభిరుచుల్లో మార్పులతో పాటుగా బ్యాంకింగ్ సేవలు అందరికి అందుబాటులోకి రావటంతో వివిధ సదుపాయాలతో ఉండే బహుళ అంతస్తులు ఉండే భవనాలు వెలుస్తున్నాయి. బిల్డర్ తాను అపార్ట్‌మెంట్ నిర్మించే సమయంలో అన్ని సౌకర్యాలు కల్పించినా ఆ తర్వాత వాటిని మెయింటెనెన్స్ చేయటం చాలా ఖర్చుతో కూడుకున్న పని. అందుకే అపార్ట్‌మెంట్‌లో నివసించే వారు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ లేదా సొసైటీ ఏర్పాటు చేసుకుంటారు. ఈ అసోసియేషన్ చేసే పని ఏమిటంటే అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన అన్ని పనులు అంటే సెక్యూరిటీ, లిఫ్ట్, కామన్ ఏరియా, పార్కులు, ఆట స్థలాలు మొదలైన వాటిని చూసుకుంటుంది. దీనిలో అపార్ట్‌మెంట్‌లోని అందరు సభ్యులుగా వ్యవహరిస్తారు. నెలవారీ ఖర్చుల కోసం ప్రతి సభ్యుడి నుంచి కొంత మెయింటెనెన్స్ చార్జీల కింద వసూలు చేస్తారు. మరి ఇలా వసూలు చేసే చార్జీల మీద ఆయా సంక్షేమ సంఘాలు జీఎస్‌టీ చెల్లించాలా? చెల్లించాల్సి వస్తే దాని విధి విధానాలు ఏమిటి? ఇలాంటి సందేహాలు చాలా మందికి ఉన్నాయి.

**మినహాయింపులున్నాయ్..:** రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ జీఎస్‌టీ చెల్లించాలా అంటే.. కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే ఇది కొత్తగా విధించిన పన్ను కాదు.. జీఎస్‌టీ వచ్చినప్పటి నుంచి ఉంది. ఇంకా చెప్పాలంటే సర్వీస్ ట్యాక్స్ కాలం నుంచి ఉంది. మరి ఇది అందరూ చెల్లించాలా అంటే, దీనికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి. తమ సభ్యుల ద్వారా వసూలు చేసే మొత్తం సంవత్సరానికి రూ.20 లక్షలు దాటనంత వరకు ఆయా సంక్షేమ సంఘాలకు జీఎస్‌టీ కింద రిజిస్ట్రేషన్ అవసరం లేదు. ఒకవేళ ఆ మొత్తం రూ.20 లక్షలు దాటితే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. ఇంకా సభ్యుడి నుంచి వసూలు చేసే నెలవారీ మెయింటెనెన్స్ నెలకు రూ.7,500 మించకపోతే ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు ఒక అపార్ట్‌మెంట్‌లో మూడు బెడ్‌రూమ్స్ ఫ్లాట్‌కు మెయింటెనెన్స్ చార్జీ నెలకు రూ.8,000, రెండు బెడ్‌రూమ్స్‌కు రూ.7,000 అనుకుందాం. అప్పుడు మూడు బెడ్‌రూమ్స్ ఫ్లాట్‌కు సంబంధించిన మెయింటెనెన్స్ చార్జీ మీద అంటే రూ.8,000 మీద మాత్రమే జీఎస్‌టీ కడితే సరిపోతుంది. అయితే ఇక్కడ ఒక సందేహం రావచ్చు. రూ.7,500 వరకు పన్ను మినహాయింపు ఉంది కాబట్టి అది పోనూ మిగతా మొత్తం మీద అంటే రూ.500 మీద జీఎస్‌టీ కడితే సరిపోతుందా అని. దీనికి సంబంధించి ప్రభుత్వం ఒక వివరణ ఇవ్వటం జరిగింది. దీని ప్రకారం ఒక నెల మెయింటెనెన్స్ చార్జీ రూ.7,500 దాటినట్లయితే, మొత్తం చార్జీ మీద జీఎస్‌టీ కట్టాల్సి ఉంటుంది. అంటే ఇప్పుడు చెప్పుకున్న ఉదాహరణలో రూ.500 మీద కాకుండా మొత్తం రూ.8,000కు జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది.

**ఒకరికి ఒకటి కంటే ఎక్కువ ఫ్లాట్స్ ఉంటే..:** అలాగే ఒక అపార్ట్‌మెంట్‌లో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ ఫ్లాట్స్ ఉంటే జీఎస్‌టీ కోసం మెయింటెనెన్స్ చార్జీని మొత్తంగా కలిపి చూడాలా లేదా విడివిడిగా చూడాలా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. పైన చెప్పిన ఉదాహరణలో ఒకే వ్యక్తికి ఒక మూడు బెడ్‌రూమ్స్ ఫ్లాట్, ఇంకా రెండు బెడ్‌రూమ్స్ ఫ్లాట్ ఉన్నాయనుకుందాం. రెండింటి మీద కలిపి రూ.15,000 మెయింటెనెన్స్ కట్టాల్సి వస్తుంది. ఈ మొత్తం పన్ను మినహాయింపు పరిమితి రూ.7,500 మించి ఉంది కాబట్టి మొత్తం మీద జీఎ?సటీ కట్టాల్సి ఉంటుందా? దీనికి కూడా వివరణ ఇవ్వటం జరిగింది. ఒక వ్యక్తికి ఎన్ని ఫ్లాట్లు ఉన్నప్పటికీ ఏ ఫ్లాట్‌కు అయితే మెయింటెనెన్స్ రూ.7,500 దాటుతుందో దాని మీద మాత్రమే జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని అపార్ట్‌మెంట్లలో తక్కువ ఫ్లాట్లు ఉన్నప్పుడు మెయింటెనెన్స్ రూ.7,500 దాటినప్పటికీ, వార్షిక టర్నోవర్ రూ.20 లక్షలు దాటకపోవచ్చు. అలాంటప్పుడు అసోసియేషన్స్‌కు జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ అవసరం లేదు.

**ఐటీసీ తీసుకోవచ్చా..:** మరి ఈ వెల్ఫేర్ అసోసియేషన్ తాము పొందిన వస్తు సేవల మీద జీఎస్‌టీ నిబంధనల మేరకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకోవచ్చా అంటే, కచ్చితంగా తీసుకోవచ్చు (ఐటీసీ నిబంధనల మేరకు మాత్రమే). మరి ఎలాంటి ఖర్చుల మీద తీసుకోవచ్చంటే.. సెక్యూరిటీ, లిఫ్ట్, కామన్ ఏరియా, మెయింటెనెన్స్, స్టేషనరీ, పంపులు, పైపులు, ఇతరత్రా అసోసియేషన్‌కు సంబంధించిన ఖర్చులు. అయితే వర్క్స్ కాంట్రాక్ట్ సర్వీసులకు ఐటీసీ తీసుకోరాదు. ఇంకొక విషయం ఏమిటంటే అసోసియేషన్‌లో కొంతమంది రూ.7,500 పైన, మరికొందరు రూ.7,500 కంటే తక్కువ చెల్లిస్తున్నట్లయితే పన్ను చెల్లించే టర్నోవర్ ప్రకారం క్రెడిట్ తీసుకోవాలి.

# నాకు ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత: వినేశ్ ఫోగాట్ తీవ్ర హెచ్చరిక

తెలంగాణ పత్రిక ,మే 3



భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కంచుకోట అయిన గొండాలో జరగబోయే నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ పై ఏస్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ టోర్నీలో తనకు గానీ, తన బృందానికి గానీ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే.. దానికి కేంద్ర ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖనే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె తీవ్ర స్వరంతో హెచ్చరించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేసిన వినేశ్ ఫోగాట్, మే 12 నుంచి 14 వరకు గొండాలో జరగనున్న టోర్నమెంట్‌లో తాను పాల్గొననున్నట్లు తెలిపింది. “బ్రిజ్ భూషణ్, ఆయన మనుషుల నియంత్రణలో జరిగే ఈ టోర్నీలో కష్టపడి ఆడే అథ్లెట్లకు న్యాయం జరగడం అసాధ్యం. ఎవరి మ్యాచ్‌కు ఎవరు రిఫరీగా ఉంటారు, ఎవరికి ఎన్ని పాయింట్లు వేస్తారు అనేదంతా వాళ్లే నిర్ణయిస్తారు” అని ఆమె ఆరోపించింది. క్రీడాకారుల వెయిట్ చెకింగ్ ప్రక్రియ కూడా పారదర్శకంగా జరగదనే అనుమానాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఇదే వీడియోలో, బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో కోర్టులో ఫిర్యాదు చేసిన ఆరుగురు మహిళా రెజ్లర్లలో తానూ ఒకరినని వినేశ్ తొలిసారిగా వెల్లడించింది. “లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మేము మూడేళ్ల క్రితమే గళమెత్తాం. కేసు విచారణలో ఉన్నందున ఇప్పటివరకు మాట్లాడలేదు. కానీ ఫిర్యాదు చేసిన ఆ ఆరుగురిలో నేనూ ఒక బాధితురాలిని” అని ఆమె స్పష్టం చేసింద. బ్రిజ్ భూషణ్‌ను అధికారికంగా డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ పదవి నుంచి తొలగించినప్పటికీ, ఫెడరేషన్‌పై తనకే పట్టుందని ఆయన బహిరంగంగా చెబుతున్నా క్రీడా మంత్రిత్వ శాఖ ప్రేక్షకపాత్ర వహిస్తోందని వినేశ్ ఫోగాట్ విమర్శించారు.

## ఐపీఎల్‌లో భారీ డీల్.. మిట్టల్ ఫ్యామిలీ చేతికి రాజస్థాన్ రాయల్స్..

తెలంగాణ పత్రిక ,మే 3



ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మీ ఎన్. మిట్టల్ కుటుంబం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్‌ను కొనుగోలు చేసింది. ఈ భారీ ఒప్పందంలో ‘వ్యాక్సిన్ ప్రిన్స్’ అదర్ పూనావాలా కూడా భాగస్వామిగా చేరారు. మనోజ్ బడాలే నేతృత్వంలోని కన్సార్టియం నుంచి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేస్తున్నట్లు మిట్టల్ కుటుంబం ఆదివారం ఒక ప్రకటనలో అధికారికంగా తెలిపింది. ఈ ఒప్పందం పూర్తయ్యాక రాజస్థాన్ రాయల్స్‌లో మిట్టల్ కుటుంబానికి సుమారు 75 శాతం వాటా ఉంటుంది. అదర్ పూనావాలాకు 18 శాతం, మనోజ్ బడాలే సహా ప్రస్తుత పెట్టుబడిదారులకు 7 శాతం వాటా కొనసాగుతుంది. రాజస్థాన్ రాయల్స్ మెన్స్ ఫ్రాంచైజీ, దక్షిణాఫ్రికాలోని పార్ల్ రాయల్స్, కరీబియన్‌లోని బార్బడోస్ రాయల్స్‌తో కలిపి ఈ మొత్తం డీల్ విలువ సుమారు 1.65 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 13,700 కోట్లు) అని అంచనా. గతంలో కల్ సోమానీ నేతృత్వంలోని కన్సార్టియం రాజస్థాన్ రాయల్స్‌ను కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చినా, నిధుల సమీకరణలో విఫలం కావడంతో ఆ ఒప్పందం ముందుకు సాగలేదు. ఫ్రాంచైజీ వ్యవస్థాపకుల్లో ఒకరైన బడాలే.. తన అనుభవంతో జట్టుకు మద్దతుగా కొనసాగుతారని యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా లక్ష్మీ మిట్టల్ మాట్లాడుతూ, “నాకు క్రికెట్ అంటే ఇష్టం, మా కుటుంబం రాజస్థాన్‌కు చెందినది. అందుకే రాజస్థాన్ రాయల్స్ జట్టులో భాగం కావడం కంటే సంతోషం మరొకటి లేదు” అని అన్నారు. ఫ్రాంచైజీ వారసత్వాన్ని కొనసాగిస్తామని, కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తామని ఆదిత్య మిట్టల్ తెలిపారు. బీసీసీఐ, సీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నుంచి అవసరమైన అనుమతులు లభించిన తర్వాత ఈ కొనుగోలు ప్రక్రియ 2026 మూడో త్రైమాసికంలో పూర్తయ్యే అవకాశం ఉంది. కాగా, కరోనా సమయంలో కొవిషీల్డ్ వ్యాక్సిన్ తయారీతో ప్రపంచం దృష్టించిన ఆకర్షించి ‘వ్యాక్సిన్ ప్రిన్స్’ గా సుప్రసిద్ధుడైన అదర్ పూనావాలా కూడా ఈ డీల్ లో భాగస్వామి కావడం విశేషం.

# స్పోర్ట్స్

## పంజాబ్ మ్యాచ్‌లో గాయపడ్డ అభిమాని.. పరామర్శించి, మరో మ్యాచ్‌కు ఆహ్వానించిన ప్రీతిజింటా



తెలంగాణ పత్రిక ,మే 3

ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా సిక్సర్ తగిలి గాయపడిన ఓ వృద్ధ అభిమానిని పంజాబ్ కింగ్స్ యాజమాన్యం పరామర్శించింది. ఫ్రాంచైజీ సహ యజమాని ప్రీతి జింటా, ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య స్వయంగా ఆ అభిమానితో వీడియో కాల్‌లో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటన పంజాబ్ కింగ్స్ జట్టు క్రీడాస్ఫూర్తిని, అభిమానుల పట్ల వారికున్న బాధ్యతను చాటింది. ఏప్రిల్ 19న న్యూ చండీగఢ్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో నాలుగో ఓవర్‌లో పంజాబ్ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య కొట్టిన సిక్సర్ నేరుగా హర్భజన్ స్టాండ్‌లో కూర్చున్న 62 ఏళ్ల కృష్ణన్ చంద్ ముఖానికి బలంగా తగిలింది. దీంతో ఆయనకు తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే స్పందించిన సిబ్బంది, అతడిని సమీపంలోని క్లినిక్‌కు తరలించారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న ప్రీతి జింటా, ప్రియాన్ష్ ఆర్య వెంటనే కృష్ణన్ చంద్‌కు వీడియో కాల్ చేశారు. పంజాబ్ కింగ్స్ క్రికెట్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ ఆశిష్ తులి కూడా ఈ కాల్‌లో పాల్గొన్నారు. వారు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా, హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరగబోయే పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌ను వీక్షించేందుకు రావాలని కృష్ణన్ చంద్‌ను వ్యక్తిగతంగా ఆహ్వానించారు. వచ్చేసారి స్టేడియానికి వచ్చినప్పుడు ఎలాంటి ఆందోళన లేకుండా మ్యాచ్ చూసేందుకు తానే స్వయంగా ఒక హెల్మెట్ అందిస్తానని ప్రీతి జింటా ఆయనకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం కృష్ణన్ చంద్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన త్వరగా కోలుకుని ధర్మశాలలో మ్యాచ్ చూసేందుకు వస్తారని ఆశిస్తున్నట్లు పంజాబ్ కింగ్స్ యాజమాన్యం పేర్కొంది.

# గ్రాండ్ గా గోపీచంద్ కొత్త సినిమా ప్రారంభం...
## స్నేహితులే నిర్మాతలు, ఫైట్ మాస్టర్ దర్శకత్వం

తెలంగాణ పత్రిక ,మే 3




టాలీవుడ్ యాక్షన్ హీరో గోపీచంద్ తన 34వ సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ ఫైట్ మాస్టర్ వి.వెంకట్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆదివారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా మొదలైంది. సీనియర్ నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, దిల్ రాజు కెమెరా స్విచాన్ చేశారు. 'గోపీచంద్ 34'గా తాత్కాలికంగా పిలుస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఉన్నత నిర్మాణ విలువలతో ఒక రూటెడ్ యాక్షన్ డ్రామాగా దీన్ని రూపొందించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ గురించి గోపీచంద్ మాట్లాడుతూ.. "ఇంతకుముందు నా సినిమాలకు వెంకట్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. ఆయన పనితనం అంటే నాకు ఎంతో ఇష్టం. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో పనిచేయడం, నా స్నేహితులైన విజయ్, శశి నిర్మాణంలో ఈ ప్రయాణం మొదలుపెట్టడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. శామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, శ్యామ్‌దత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ–మోనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలు, రెగ్యులర్ షూటింగ్ షెడ్యూల్ త్వరలో ప్రకటిస్తామని చిత్రబృందం వెల్లడించింది.

# అడవి శేష్ 'డెకాయిట్' ఓటీటీలోకి వచ్చేస్తోంది!

తెలంగాణ పత్రిక ,మే 3




విభిన్నమైన థ్రిల్లర్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటుడు అడివి శేష్. ఆయన హీరోగా నటించిన తాజా యాక్షన్ లవ్ స్టోరీ 'డెకాయిట్'. థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ నెల 8వ తేదీ నుంచి ఈ చిత్రం అందుబాటులోకి రానుంది. ఈ చిత్రంలో అడివి శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. అతుల్ కులకర్ణి, వైభవ్ వంటి నటులు ఇతర కీలక పాత్రల్లో కనిపించారు. షనీల్ డియో ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. దర్శకుడితో కలిసి అడివి శేష్ స్వయంగా ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చారు. ఇక సినిమా కథ విషయానికొస్తే, ఓ హత్య కేసులో 13 ఏళ్లు జైలు శిక్ష అనుభవించిన హరిదాస్ (అడివి శేష్) పోలీసుల నుంచి తప్పించుకుంటాడు. తనను అన్యాయంగా జైలుకు పంపిన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్) పై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఆమెను వెతికే క్రమంలో అతడికి కొన్ని ఊహించని నిజాలు తెలుస్తాయి. వారిద్దరూ ఎందుకు విడిపోయారు? హరి తన పగను ఎలా తీర్చుకున్నాడు? అనేదే ఈ చిత్ర కథాంశం. అడివి శేష్ మార్క్ థ్రిల్లింగ్ అంశాలతో పాటు, భావోద్వేగభరితమైన ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రం పై ఓటీటీ వీక్షకుల్లో ఆసక్తి నెలకొని ఉంది.

# 13 ఏళ్ల చెల్లికి బర్త్ డే విషెస్ తెలిపిన రష్మిక

- 13వ ఏట అడుగుపెట్టిన చెల్లి షిమన్‌కు రష్మిక బర్త్ డే విషెస్
- చెల్లిని తన కూతురిలా చూసుకుంటానని తెలిపిన నటి
- ఫిబ్రవరిలో విజయ్ దేవరకొండతో తన పెళ్లికి షిమన్ హాజరైందని వెల్లడి
- 'మైసా' సినిమా కోసం కేరళలో యాక్షన్ షెడ్యూల్‌లో పాల్గొంటున్న రష్మిక
- షాహిద్ కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో నటించనున్న వైనం

తెలంగాణ పత్రిక ,మే 3



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన చెల్లి షిమన్ మందన్న పై ప్రేమను కురిపిస్తూ పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ వైరల్ అవుతోంది. శనివారం షిమన్ 13వ పుట్టినరోజు జరుపుకోగా, రష్మిక ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. చెల్లిని గట్టిగా హత్తుకున్న ఫోటోను పంచుకుంటూ.. "నా స్వీటీకి 13వ పుట్టినరోజు శుభాకాంక్షలు! ఈ వయసు చాలా సరదాగా ఉంటుంది, దాన్ని ఆస్వాదించు. ఐ లవ్ యూ స్వీటీ!! నీకు పెద్ద హగ్స్!" అని రాసుకొచ్చారు. కేక్ కట్ చేస్తున్న, ముఖానికి కేక్ అంటిన షిమన్ క్యూట్ ఫోటోలను కూడా పంచుకున్నారు. రష్మిక, ఆమె చెల్లి షిమన్‌కు మధ్య 16 ఏళ్ల వయసు వ్యత్యాసం ఉంది. ఈ కారణంగానే షిమన్‌ను తన కూతురిలా చూసుకుంటానని రష్మిక గతంలో చాలాసార్లు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పూర్‌లో నటుడు విజయ్ దేవరకొండతో తన వివాహానికి షిమన్ హాజరైందని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించడం ఆసక్తికరంగా మారింది. ఇక సినిమాల విషయానికొస్తే, రష్మిక ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ "మైసా" షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే కేరళలో 15 రోజుల యాక్షన్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల కోసం రష్మిక థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. అక్కడ రోజుకు 8 గంటలకు పైగా కఠినమైన స్టంట్స్ నేర్చుకున్నారు. ఈ చిత్రంలో రష్మిక గిరిజన యువతి పాత్రలో కనిపించనున్నారు. "మైసా" చిత్రంలో రష్మికతో పాటు ఈశ్వరీరావు, గురు సోమసుందరం, రావు రమేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇది కాకుండా, షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి హిందీలో "కాక్‌టెయిల్ 2" చిత్రంలో కూడా రష్మిక నటిస్తున్నారు.

# బండ్ల గణేశ్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు వెంకయ్యనాయుడు, లగడపాటి రాజగోపాల్ సహా ప్రముఖులు హాజరు



తెలంగాణ పత్రిక ,మే 3

ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని నిశ్చితార్థ వేడుక ఆదివారం ఉదయం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజతో జనని వివాహం జరగనుంది. ఈరోజు హైదరాబాద్‌లో జరిగిన నిశ్చితార్థ వేడుకకు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై, కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఈ నిశ్చితార్థ వేడుకకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, స్టార్ కమెడియన్ బ్రహ్మానందం, దర్శకుడు శ్రీను వైట్ల, శివాజీ, కోన వెంకట్, సి. కల్యాణ్, విజయవాడ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తదితరులు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు విచ్చేశారు.

# 'ఆడు 3' (జీ 5) మూవీ రివ్యూ!

తెలంగాణ పత్రిక ,మే 3

మలయాళంలో 'ఆడు' సిరీస్ నుంచి వచ్చిన 3వ సినిమానే 'ఆడు 3'. 2017లో వచ్చిన రెండవ భాగానికి సీక్వెల్ గానే ఈ కథ నడుస్తుంది. మిథున్ మాన్యువల్ థామస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మార్చి 19వ తేదీన థియేటర్లకు వచ్చింది. 50 కోట్లకి పైగా బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, 100 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. ఈ నెల 1వ తేదీ నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో పాటు, ఇతర భాషల్లోను అందుబాటులోకి వచ్చింది. కేరళ ప్రాంతంలోని ఒక విలేజ్ లో షాజీ పాపన్ (జయసూర్య) నివసిస్తూ ఉంటాడు. క్లీటస్ తో పాటు ఇతర స్నేహితులతో కలిసి తిరుగుతుంటాడు. తాను ఒక రాజుగా కత్తిపట్టడం .. రాజ్యం .. యుద్ధం తాలూకు దృశ్యాలు అప్పుడప్పుడు అతని కళ్లముందు కదలాడుతూ ఉంటాయి. అందుకు కారణం ఏమిటనేది అతనికి అర్థం కాదు. స్నేహితుల కారణంగా, స్క్రాప్ బిజినెస్ చేయాలనే ఆలోచన అతనికి వస్తుంది. ఆ సమయంలోనే పాతకాలం నాటి ఒక వంతెన కూల్చివేత .. దాని స్క్రాప్ కి సంబంధించిన టెండర్ అతని కంట పడుతుంది. ఈ టెండర్ కి సంబంధించిన పనులపై పాపన్ తిరుగుతూ ఉంటాడు. దానిని ఎలాగైనా దక్కించుకోవాలనే పట్టుదలతో ప్రయత్నిస్తూ ఉంటాడు. అదే సమయంలో ఆ టెండర్ కోసం సాతన్ సేవియర్ (సన్నీవేన్) ట్రై చేస్తూ ఉంటాడు. వంతెన స్క్రాప్ కి సంబంధించిన టెండర్ ను వదులుకోమని పాపన్ తో సేవియర్ అంటాడు. అక్కడ తన తాత వాల్టర్ జోసెఫ్ అస్థికలు ఉన్నాయనీ .. వాటిని జాగ్రత్తగా వెలికి తీయవల్సిన బాధ్యత తనకి ఉందని చెబుతాడు. అలా చేస్తే 25 లక్షలు ఇస్తానని అంటాడు. సేవియర్ అంత డబ్బు ఇస్తానని అనడంతో పాపన్ కి సందేహం కలుగుతుంది. వంతెనలో విలువైన వస్తువేదో దాచబడి ఉందనీ, దానిని



కాజేయడం కోసమే సేవియర్ ప్లాన్ చేస్తున్నాడని పాపన్ పసిగడతాడు. అందువలన అతను సేవియర్ ఆఫర్ ను తిరస్కరిస్తాడు. అదే సమయంలో .. అదే విషయంలో సులేమాన్ (వినాయకన్) ఎంట్రీ ఇస్తాడు. సులేమాన్ ఎవరు? ఆ వంతెన నిర్మాణంలో దాచబడిన వస్తువు ఏమిటి? దానితో వాళ్లకి గల సంబంధం ఏమిటి? చివరికి అది ఎవరి చేతికి చిక్కుతుంది? అనేది మిగతా కథ. ఈ కథ .. 17వ శతాబ్దంలోను .. 2025లోను .. 2370లోను నడుస్తుంది. 2370లో 'స్టార్ డస్ట్' అనే ఒక శక్తిమంతమైన వస్తువును చేజిక్కుంచుకునే ప్రయత్నంతో ఈ కథ మొదలవుతుంది. ఎక్కువ భాగం 17వ శతాబ్దం – 2025లలో నడుస్తుంది. 17వ శతాబ్దంలో కథ ఏ అంశం చుట్టూ అయితే తిరుగుతూ ఉంటుంది. 2370వ సంవత్సరంలోను అదే అంశం చుట్టూ ఈ కథ నడుస్తూ ఉంటుంది. ఈ మూడు కాలాలలోను దర్శకుడు సెట్ చేసిన లింకులు కరెక్టుగానే కనిపిస్తాయి. 17వ శతాబ్దంలో నడిచే కథలో ఏవైతే ప్రధానమైన పాత్రలుగా కనిపిస్తాయో, 2025లో నడిచే కథలోని ప్రధానమైన పాత్రలలోను అదే ఆర్టిస్టులు కనిపిస్తారు. అంటే ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా ద్విపాత్రాభినయం చేశారన్న మాట. ఆంగ్లేయుల కాలంలో రాజా పద్మనాభన్ గా .. ప్రస్తుత కాలంలో పాపన్ గా జయసూర్య, ఆజంఖాన్ గా .. సులేమాన్ గా వినాయకన్, వాల్టర్ జోసెఫ్ గా – సేవియర్ గా సన్నీ వేన్.. ఇలా అందరూ ఈ రెండు కాలాల్లో .. రెండేసి పాత్రల్లో కనిపిస్తారు. రెండు కాలాలకు సంబంధించిన కథ తెరపై కలిసి కదులుతూ ఉంటుంది. 2370నాటి కాలానికి సంబంధించిన కథ మాత్రం అప్పుడప్పుడు తొంగిచూస్తూ ఉంటుంది. వేరు వేరు కాలాల్లో కథ ఒకే వస్తువు చుట్టూ, ఒక్కో ఆర్టిస్ట్ పోషించిన రెండు పాత్రల చుట్టూ తిరగడం కొత్తగా అనిపిస్తుంది. ఒక రకంగా ఇది ప్రయోగంగానే చెప్పుకోవాలి. కాకపోతే సామాన్య ప్రేక్షకులను అయోమయానికి గురిచేసే అంశం కూడా ఇదేనని చెప్పుకోవాలి. దర్శకుడు ఈ కథను పూర్తిస్థాయి కామెడీతో చెప్పాలని ముందుగానే నిర్ణయించుకున్నాడు. అయితే కామెడీకి తగిన సమయం .. సందర్భం వచ్చేవరకూ వెయిట్ చేయలేదు. ప్రతి సన్నివేశంలో .. ప్రతి పాత్రతో .. ప్రతి సందర్భంలో కామెడీని పరిగెత్తించడానికి ప్రయత్నించాడు. కాకపోతే అది చాలా తక్కువసార్లు మాత్రమే వర్కౌట్ అయింది.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143